# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL


## కేసీఆర్ అంటేనే ఉద్యమం, అభివృద్ధి




సంపుటి : 09 సంచిక : 172 పేజిలు : 08, వెల రూ. 5రూ/ సోమవారం- 30 - జూన్- 2025


## తాడిపత్రిలో మరోసారి భగ్గుమన్న రాజకీయ వైరం

తాను మూడు రోజులు ఊళ్లో ఉండటం లేదని జేసీ ప్రకటన

నీ ఇల్లు కూలగొట్టేస్తారేమో అంటూ వ్యాఖ్యలు

తన శత్రువు పెద్దారెడ్డే కానీ వైసీపీ కార్యకర్తలు కాదన్న జేసీ

తన పోరాటం చట్టబద్ధంగానే ఉంటుందని వెల్లడి



అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన రాజకీయ ప్రత్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. తాను కొన్ని రోజుల పాటు ఊరిలో ఉండటం లేదని, ఈ సమయంలో ఇంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, లేదంటే కూల్చివేస్తారేమోనని జేసీ చేసిన వ్యాఖ్యలు మిగతా..2లో

## బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై అత్యాచారం, ఐదుగురి అరెస్ట్

బాధితురాలి వీడియోను చిత్రీకరించి సోషల్ మీడియాలో వ్యాప్తి

కొమిల్లా జిల్లాలో గురువారం జరిగిన దారుణ ఘటన

ప్రధాన నిందితుడు ఫజ్ర్ అలీతో పాటు మరో నలుగురిని

అదుపులోకి తీసుకున్న పోలీసులు

మైనారిటీలపై దాడుల పట్ల పెరుగుతున్న ఆందోళనలు

మైనారిటీల భద్రత బంగ్లా ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసిన భారత్



బంగ్లాదేశ్‌లో తీవ్ర కలకలం రేపిన అత్యాచార ఘటనలో పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. హిందూ వర్గానికి చెందిన ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, ఆ దారుణాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేసిన ఆరోపణలపై మిగతా..2లో

## వారిని వదిలేది లేదు..

# కేంద్రమంత్రి అమిత్ షా

- నిజామాబాద్‌లో కేంద్రమంత్రి అమిత్ షా పసుపు బోర్డును ప్రారంభించారు.
- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..
- 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కలను ప్రధాని మోదీ నెరవేర్చారని అన్నారు.
- పహల్గాం ఘటనకు ప్రతీకారంగా పాకిస్థాన్ మూకలకు బుద్ధి చెప్పామన్నారు.



హైదరాబాద్ : నిజామాబాద్‌లో కేంద్రమంత్రి అమిత్ షా పసుపు బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కలను ప్రధాని మోదీ నెరవేర్చారని అన్నారు. పసుపు బోర్డు ఇక్కడికి రావడంలో రాష్ట్ర బీజేపీ ఎంపీల కృషి చాలా ఉందన్నారు. నిజామాబాద్ పసుపు ప్రపంచ మార్కెట్ లోకి వెళ్తుందని, పసుపు ధర పెరుగుతుందని, వ్యాపారాలు పెరుగుతాయని వ్యాఖ్యానించారు. మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్ ఆఫీస్ కూడా నిజామాబాద్‌లో ఉంటాయని, మిగతా..2లో

## తెలంగాణలో ఈదురుగాలులతో వానలు..

# హెచ్చరించిన ఐఎండీ

- మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.
- తెలంగాణలో మూడురోజులు వానలు కొనసాగుతాయని చెప్పింది.
- సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని..



హైదరాబాద్ : రాగల మూడురోజులు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర గుజరాత్ మీదుగానున్న ఉపరితల ఆవర్తం నుంచి వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌ఘడ్, ఉత్తర ఒడిశా మీదుగా అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతూ.. సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణ దిశగా వంగి ఉందని తెలిపింది. తెలంగాణలో మూడురోజులు వానలు కొనసాగుతాయని చెప్పింది. ఆదివారం ఆసిఫాబాద్, మంచిర్యాల, మిగతా..2లో

## దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ

దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఇవాళ కాంగ్రెస్ మంత్రులు, నాయకులు సిగ్గు లేకుండా ఫోన్ ట్యాపింగ్ అంశం గురించి అడ్డగోలుగా మాట్లాడడం వింతగా ఉందన్నారు.



హైదరాబాద్ : దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ మిగతా..2లో

## ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన

# బాధ్యత మనందరిపై ఉందని

- ప్రభుత్వ వార్షికోత్సవం సందర్భంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం
- నెల రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యేలు, ఎంపీలకు చంద్రబాబు ఆదేశం
- మనం చేసిన మంచి పనులను వివరిస్తూనే, వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై సర్వేలు చేయిస్తున్నా.. బాగోకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- తప్పులు పునరావృతం కావొద్దని, 2029 గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక ఉగ్రవాదులతో ప్రమాదమని తీవ్ర విమర్శలు



అమరావతి : ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా, నెల రోజుల పాటు ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలకు ఆయన పిలుపునిచ్చారు. మిగతా..2లో

## అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే

# వ్యవహరించాలి

**పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించవద్దని సూచించిన మంత్రి లోకేశ్**




అమరావతి : అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న లోకేశ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కష్టపడాలని సూచించారు. 151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా తల్లికి వందనం అమలు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తేల్చిచెప్పారు. మిగతా..2లో

- ఎన్టీఆర్ భవన్?లో తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం
- ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా తల్లికి వందనం అమలు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు.
- మనం ఎక్కడ కూర్చోవాలో ప్రజలే నిర్ణయిస్తారని లోకేశ్ అభిప్రాయపడ్డారు.
- తొలి అడుగు- ఇంటింటికీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

## 'హమాస్ తో డీల్ కుదుర్చుకోండి'

# ఇజ్రాయెల్ కు ట్రంప్ సూచన

- హమాస్?తో ఒప్పందం కుదుర్చుకోమని పోస్ట్ పెట్టిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- యుద్ధాన్ని ముగించి, సంధి కుదుర్చుకోవాలని అన్నారు.
- 251 మందిని బందీలుగా పట్టుకుపోయింది. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోయారు.
- ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు.



ఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్?తో ఒప్పందం కుదుర్చుకోమని ఇజ్రాయెల్?ను కోరారు. యుద్ధాన్ని ముగించి, సంధి కుదుర్చుకోవాలని అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్?ఫామ్? ట్రూత్?లో పోస్ట్ పెట్టారు. గాజాలో ఒప్పందం చేసుకోండని, బందీలను వెనక్కి తీసుకురండని పేర్కొన్నారు. అయితే ట్రంప్ ఇప్పటికే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించారు. దాన్ని ఇప్పుడు ఆమోదించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ఆయన ఒత్తిడి తెచ్చినట్లైంది. గాజాలో వచ్చేవారం సంధి కుదురుతుందని తొలుత ట్రంప్ ప్రకటించారు. మిగతా..2లో

## సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి

# కిషన్ రెడ్డి సవాల్



ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

ఈ విమర్శలపై కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి స్పందించారు.

ఆ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు.

హైదరాబాద్, జూన్ 29: తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏ మాత్రం సహకరించడం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి కాస్తా ఘాటుగా స్పందించారు. ఆదివారం హైదరాబాద్‌లో మిగతా..2లో

## ఈసెట్ కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం అంటూ

# ప్రభుత్వంపై విరుచుకుపడిన జగన్

-ఫలితాలొచ్చి 45 రోజులైనా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదని విమర్శ

-"అమాత్యా మేలుకో, పప్పూ నిద్ర వదులు" అంటూ ఘాటు వ్యాఖ్యలు

అమరావతి : రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, అందుకు



ఏపీ ఈసెట్ అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యమే నిదర్శనమని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫలితాలు వెలువడి నెలన్నర రోజులు గడుస్తున్నా ఇంతవరకు కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ అని విమర్శించారు. ఈసెట్ ఫలితాలు గత నెల మే 15వ తేదీన వెలువడినా, నేటికీ అడ్మిషన్ల ప్రక్రియపై ఎలాంటి షెడ్యూల్ విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎంత దారుణంగా అస్తవ్యస్తంగా మారిందో మిగతా..2లో

## అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి

మొదటి పేజీ తరువాయి

### అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి: మంత్రి లోకేశ్

దేశం మొత్తం తిరిగినా, ప్రపంచం మొత్తం తిరిగినా తిరిగి వచ్చేది మనం పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికేనని మంత్రి లోకేశ్ గుర్తుచేశారు. దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడిచేస్తే పట్టించుకోని పరిస్థితి ఆనాటి పాలనలో చూసామని ధ్వజమెత్తారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను మరువద్దని నాయకులనీ కోరుతున్నానని అలానే పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని సీరియస్?గా తీసుకోవాలని సూచించారు. మనం ఎక్కడ కూర్చోవాలో ప్రజలే నిర్ణయిస్తారని లోకేశ్ అభిప్రాయపడ్డారు. పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. డోర్ టూ డోర్ ప్రచారం: అనుబంధ విభాగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేశ్ తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని అలానే జులై 5 నాటికి కమిటీలన్నింటినీ పూర్తిచేయాలని నేతలను ఆదేశించారు. సీనియర్లకు ఉన్న అనుభవం, యువతకు ఉన్న శక్తి రెండింటినీ జోడించాల్సిన అవసరం ఉందని అన్నారు. సీనియర్లే 4 దశాబ్దాలు పార్టీని ముందుకు తీసుకెళ్లారని అదేవిధంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కూడా ఇంటింటికీ తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. నెల రోజుల పాటు తూచా తప్పకుండా అందరం డోర్ టూ డోర్ ప్రచారం చేసి సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

## విద్యావ్యవస్థ అస్తవ్యస్తం...
## ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ: జగన్

మొదటి పేజీ తరువాయి

చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలని ఆయన అన్నారు. రేపటి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానుండగా, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన "అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 34 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షకు హాజరుకాగా, వారిలో 31,922 మంది అర్హత సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంతమంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని జగన్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## వారిని వదిలేది లేదు..
## కేంద్రమంత్రి అమిత్ షా

మొదటి పేజీ తరువాయి

వివిధ దేశాలకు ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. పహల్గాం ఘటనకు ప్రతీకారంగా పాకిస్థాన్ మూకలకు బుద్ధి చెప్పామన్నారు. ఈ నేపథ్యంలోనే.. నక్సల్స్ ఆయుధాలు పక్కన పెట్టి లొంగిపోవడం మంచిదని సూచించారు. నక్సల్ కు వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆయుధాలు పట్టిన వారిని వదిలేది లేదని హెచ్చరించారు. నక్సల్స్ కు మద్దతుగా మాట్లాడే వారు, వారి బాధిత కుటుంబాల పరిస్థితి తెలుసుకోవాలని అన్నారు. 2026 మార్చి చివరి వరకు నక్సల్స్ ను పూర్తిగా అంతమొందిస్తామన్నారు. రాష్ట్రంలో భారీ అవినీతి జరిగిందని, తెలంగాణ మొన్నటి వరకు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం గా ఉందని, ఇప్పుడు రేవంత్ రెడ్డికి మారిందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే అవినీతి అంతం అవుతుందని కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.


## తాడిపత్రిలో మరోసారి
## భగ్గుమన్న రాజకీయ వైరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్నాయి. ఇక మీకు రఫా రఫా తప్పదని హెచ్చరించారు. తాజాగా తన అనుచరులతో మాట్లాడిన జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను ఊరికి వెళుతున్నా. ఓ మూడు రోజుల్లో నీ ఇంటిని ప్రొక్లైనర్ పెట్టి కూల్చేస్తారేమో.. కాపాడుకో పెద్దారెడ్డి. నీకోసమే కాచుకుని ఉన్నారు" అంటూ బహిరంగంగా హెచ్చరించారు. తన కార్యకర్తలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, ఇన్నాళ్లూ తానే వారిని అదుపు చేస్తూ వచ్చానని తెలిపారు. "మా వాళ్లు చాలా కోపంగా ఉన్నారు. రఫ్ఫాడించడానికి సిద్ధంగా ఉన్నారు. నేను గట్టిగా పట్టుకుని కూర్చున్నాను కాబట్టే ఆగుతున్నారు. నేను లేనప్పుడు ఏం జరుగుతుందో చూసుకో" అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో తాము, తమ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డామని, మహిళలు కూడా జైలుకు వెళ్లారని జేసీ గుర్తుచేశారు. ఆ కక్షతోనే తన అనుచరులు రగిలిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే, తన శత్రుత్వం కేవలం కేతిరెడ్డి పెద్దారెడ్డితోనే తప్ప, వైసీపీ కార్యకర్తలతో కాదని ఆయన స్పష్టం చేశారు. "మాకు శత్రువు పెద్దారెడ్డి మాత్రమే, వైసీపీ కార్యకర్తలు కాదు. ఇప్పటివరకు మేం ఏ కార్యకర్తను ఏమీ అనలేదు. అందరిపైనా చట్ట ప్రకారమే ముందుకెళుతున్నాం," అని జేసీ వివరించారు. పెద్దారెడ్డి ఇంటి నిర్మాణంలో కూడా చట్టపరమైన లోపాలు ఉన్నాయని, అయినా తాము చట్టబద్ధంగానే వెళుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన పోరాటం వ్యక్తిగతమని, తాను, తన పిల్లలు ఈ శత్రుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రభాకర్ రెడ్డి తేల్చిచెప్పారు. ప్రజలకు తాను ఏంటో తెలుసని, అందుకే తనను గెలిపించారని అన్నారు. జేసీ చేసిన ఈ వ్యాఖ్యలతో తాడిపత్రిలో మరోసారి రాజకీయ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

## సీఎం రేవంత్ రెడ్డికి
## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవాల్

విలేకర్ల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే ఏమిటో ప్రధాని మోదీని చూసి తెలుసుకోమంటూ సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మరి నువ్వు సిద్ధమా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. రాజకీయాల కోసం ఇలా మాట్లాడితే.. ఎలా అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. మీరు, మీ క్యాబినెట్ సహచరులు ఇలా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవిపై మంగళవారం క్లారిటీ వస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి.. నోటిఫికేషన్ ఈ రోజు వస్తుందన్నారు. సోమవారం నామినేషన్లు వేస్తారన్నారు. మంగళవారం నూతన అధ్యక్ష పదవిపై ప్రకటన వస్తుందని చెప్పారు. అయితే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం చేయాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించనున్న సునీల్ బన్సల్, శోభా కర్లందాజ్లే సోమవారం రాష్ట్రానికి రానున్నారని వివరించారు. వారి సమక్షంలోనే నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. నిజామాబాద్‌లో ఆదివారం పసుపు బోర్డు ప్రారంభిస్తున్నామని గుర్తు చేశారు. తాము తెలంగాణ ప్రజల కోసమే పని చేస్తామని.. అంతేకానీ సీఎం రేవంత్ రెడ్డి కోసం.. కాంగ్రెస్ పార్టీ కోసం తాము పని చేయబోమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కుండ బద్దలు కొట్టారు. మెట్రో డీపీఆర్ గత వారమే కేంద్రానికి ఇచ్చారన్నారు. మెట్రో రైలు సాధ్యాసాధ్యాలపై కేంద్రం పరిశీలన చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణలో ఈదురుగాలులతో వానలు..
## హెచ్చరించిన ఐఎండీ



పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండలో బలమైన ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన
# బాధ్యత మనందరిపై ఉందని

మొదటి పేజీ తరువాయి

ఆదివారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పరిశీలకులతో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు.

### తప్పులు రిపీట్ చేయొద్దు!

గతంలో తాము చేసిన తప్పులు పునరావృతం కాకూడదని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది... అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. "2014లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం. కానీ, వాటిని ప్రజల్లోకి సరిగా తీసుకెళ్లలేకపోయాం, రాజకీయం మరిచిపోయాం. చాపకింద నీరులా టీడీపీపై అబద్ధాలను ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారు. వివేకానందరెడ్డి హత్యే దీనికి పెద్ద ఉదాహరణ. గుండెపోటు అని మొదట ప్రచారం చేసి, ఆ తర్వాత నాటకాలు ఆడి ప్రజల సానుభూతి పొందారు. కోడికత్తి డ్రామా, ఎన్నికల ముందు గులకరాయి డ్రామా వంటివి వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనం. ఇలాంటి దుష్ప్రచారాలను తేలిగ్గా తీసుకోవద్దు. మనం చేస్తున్న మంచిని ఎంత బలంగా వివరిస్తామో, వారి కుట్రలను కూడా అదే స్థాయిలో ప్రజలకు వివరించాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటే ఆదరిస్తారు... లేకుంటే టాటా చెప్పేస్తారు

ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండడం ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "పనిచేయడం ఒక ఎత్తయితే, జనానికి అందుబాటులో ఉండటం మరో ఎత్తు. ప్రజల్లోకి వెళ్లడానికి ఎలాంటి నామోషీ వద్దు. చేసిన పనులతో పాటు, చేయలేని పనులకు గల కారణాలను కూడా వివరించాలి. ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే, వారు అంతగా ఆదరిస్తారు. లేదంటే నిర్మొహమాటంగా టాటా చెప్పేస్తారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన పనితీరు ఉండాలి" అని సూచించారు.



ప్రతి ఒక్క ఎమ్మెల్యేతో మాట్లాడతా... మంచి చెడులు వివిస్తా

ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును తాను నిరంతరం గమనిస్తున్నానని, వివిధ మార్గాల్లో సర్వేలు చేయిస్తున్నానని చంద్రబాబు వెల్లడించారు. "ప్రతి ఎమ్మెల్యేతో త్వరలోనే నేను స్వయంగా సమావేశమవుతాను. ఇప్పటికే నలుగురితో మాట్లాడాను. వారు చెప్పేది ఓపిగ్గా వింటాను. వారిలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకోవడానికి సమయం ఇస్తాను. మారితే సంతోషం, లేదంటే నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడను. వారసులైనా సరే, కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు ఉంటుంది. పని చేయకుండా పదవులు ఆశిస్తే కుదరదు, వారికో నమస్కారం పెట్టేస్తా" అని చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు.

ప్రజలకు జవాబుదారీగా ఉందాం... పొరపాట్లు ఉంటే సరి చేసుకుందాం

పాలనలో ఏమైనా లోటుపాట్లు, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని ముందుకు సాగుదామని చంద్రబాబు అన్నారు. "ప్రజలు మెచ్చాలి, కార్యకర్తలు ఆమోదించాలి. అదే మన లక్ష్యం. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలవాలనుకోవడం బాధాకరం. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసినా 11 సీట్లకే పరిమితమయ్యారు. డబ్బు అన్నివేళలా పనిచేయదు. మనం ఆదర్శవంతమైన రాజకీయాలు చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వ కొనసాగింపుతోనే అభివృద్ధి... కళ్ల ముందున్న వాస్తవమిది

సుస్థిర ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చంద్రబాబు అన్నారు. "2004, 2019లో టీడీపీ ఓడిపోవడం వల్ల రాష్ట్రం తిరోగమనం పట్టింది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు నమ్మకంతో ముందుకొస్తున్నారు. ఏడాదిలోనే రూ.9.34 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా 8.50 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని తెలిపారు. పోలవరం, అమరావతి పనులు వేగవంతం చేశామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టిస్తున్నామని వివరించారు.

### కార్యకర్తలను మరువొద్దు

సంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ తమ ప్రభుత్వం ముందుందని చంద్రబాబు పేర్కొన్నారు. "64 లక్షల మందికి పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, డీఎస్సీ నోటిఫికేషన్, అన్నా క్యాంటీన్లు వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. విధానాలు ఎంత బాగున్నా, వాటి అమలులో లోపాలుంటే ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో బాధ్యతగా పనిచేయాలి. 2029లో గెలుపే నా ప్రణాళిక. అందుకోసం కష్టపడి పనిచేయడం కాదు, స్మార్ట్‌గా పనిచేయాలి" అని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు. రాజకీయ ముసుగు వేసుకున్న ఆర్థిక ఉగ్రవాదులు, రౌడీలతో రాష్ట్రానికి ప్రమాదమని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

## 'హమాస్ తో డీల్ కుదుర్చుకోండి'- ఇజ్రాయెల్ కు ట్రంప్ సూచన

మొదటి పేజీ తరువాయి

అక్కడికి కొన్ని గంటల్లోనే మరోసారి సోషల్ మీడియాలో ఒప్పందం కుదుర్చుకోమని పోస్ట్ పెట్టారు. అదే సమయంలో నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయెల్ ప్రాసిక్యూటర్లను అభ్యర్థించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ పోస్టును పెట్టడం విశేషం. గత బుధవారం ట్రంప్, సోషల్ మీడియాలో స్పందిస్తూ ఇజ్రాయెల్ ప్రధానిపై కేసులు కేవలం వేధింపులు అనే అర్థం వచ్చేట్లు పోస్ట్ పెట్టారు. అక్టోబర్ 7వ తేదీ హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసి వందల మందిని హత్య చేసింది. 251 మందిని బందీలుగా పట్టుకుపోయింది. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోయారు. 49 మంది ఇప్పటికీ హమాస్ చెరలోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ఇరాన్‌పై యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడి మద్దతుకు నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు. అయితే ఇటీవల కాలంలో ఇజ్రాయెల్‌కు సహాయాన్ని కూడా అమెరికా గణనీయంగా పెంచింది. వాషింగ్టన్ నుంచి ప్రపంచంలో మరే దేశానికి అంత స్థాయిలో ఆర్థిక సాయం అందలేదని చెప్పాలి. అదే



సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. విద్వేషంతో చేసిన ఖమేనీ ప్రకటన చూసిన తర్వాత ఆ దేశంపై విధించిన ఆర్థిక ఆంక్షలు సడలించాలన్న ఆలోచనను విరమించుకున్నానని చెప్పారు. ఇరాన్ తన అణుకార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తే మళ్లీ ఆ దేశంపై బాంబులు వేయడానికి తాను వెనుకాడబోనని హెచ్చరించారు. ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్?లో ఖమేనీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టు పెట్టారు.

## దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ

మొదటి పేజీ తరువాయి

డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ కాంగ్రెస్ మంత్రులు, నాయకులు సిగ్గు లేకుండా ఫోన్ ట్యాపింగ్ అంశం గురించి అడ్డగోలుగా మాట్లాడడం వింతగా ఉందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీకి వంత పాడే ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఎవరు పిలవకపోయినా.. నా ఫోన్ ట్యాప్ అయ్యిందని కామెడీ చేస్తున్నాడు. ఈ ఫోన్ ట్యాపింగ్ విచారణ చేస్తారు పోలీస్ అధికారులా? గాంధీ భవన్‌లో ఉండే కాంగ్రెస్ మంత్రులు, యూత్ కాంగ్రెస్ నాయకులా? ఏది వాస్తవమో.. ఏది అవాస్తవమో.. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రెస్‌మీట్ పెట్టి ప్రజలకు తెలియజేయండి అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతూ.. హోం మంత్రిగా బాధ్యతగల పదవిలో ఉంటూ సీఎం రేవంత్ ఇస్తున్న ఆదేశాలతో వారి అనుంగు మీడియాతో తప్పుడు రాతలపై, పిచ్చి కూతలు, దొంగ లీకులతో వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారు. మహా టీవీతో పాటు మరికొన్ని వార్తా సంస్థలు, యూట్యూబ్ ఛానెల్లు అడ్డగోలుగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వారందరిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. రేవంత్ ఆదేశాలతో మా బీఆర్ఎస్వీ నాయకుడు గెల్లు శ్రీనివాస్‌పై అక్రమ కేసులు బనాయించిన పోలీసులు.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అడ్డగోలుగా, అశ్లీలంగా,



జుగుప్సాకరమైన వార్తలు రాసిన మహా టీవీపై తెలంగాణ పోలీసులు సుమోటోగా కేసు పెట్టాలి. నిన్న మా బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మహా టీవీపై ఫిర్యాదు చేయడానికి వెళ్తితే.. తొలుత ఫిర్యాదు తీసుకోకపోతే, బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే అయిష్టంగా పోలీసులు ఫిర్యాదు తీసుకుంటున్నారు అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, ప్రజాసమస్యలను కాపాడాల్సిన పోలీసులు. నేడు 80-90 కేసుల నేర చరిత్రతో పాటు ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా కెమెరాల ముందు దొరికిన ఒక దొంగ మాటలు విని హేయమైన పాత్ర పోషిస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా సొంత ప్రభుత్వ మంత్రులైన పొంగులేటి, కొండా సురేఖలతో పాటు ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాపింగ్ చేస్తుండడం నిజం కాదా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

## బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై
# అత్యాచారం, ఐదుగురి అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

వీరిని అదుపులోకి తీసుకున్నారు. కొమిల్లా జిల్లాలోని మురాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌చంద్రాపూర్ పంచకిట్ట గ్రామంలో గురువారం ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది.

గ్రామస్థులు పట్టుకున్నా తప్పించుకున్న నిందితుడు

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, బాధితురాలు ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన 36 ఏళ్ల అలీ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అఘాయిత్యాన్ని గమనించిన స్థానిక గ్రామస్థులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అయితే, అతను వారి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న కొందరు బాధితురాలిని అసహాయ స్థితిలో వీడియో తీసి, దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. బాధితురాలు తన పరువు కాపాడాలంటూ వేడుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉండటం తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ ఘటనపై మురాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, ప్రధాన నిందితుడు అలీతో పాటు, వీడియోను రికార్డ్ చేసి వ్యాప్తి చేసిన మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు ధృవీకరించారు. నిందితులందరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.



### మైనారిటీల భద్రతపై ఆందోళన

ఈ ఘటన బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, మహిళలపై జరుగుతున్న హింసపై మరోసారి ఆందోళనలను రేకెత్తించింది. మైనారిటీ వర్గాలపై దాడులను ఖండిస్తూ మే 31న ఢాకాలోని జాతీయ ప్రెస్ క్లబ్ ఎదుట 'సమ్మిళిత సనాతన్ పరిషద్' అనే మైనారిటీ కూటమి ఆధ్వర్యంలో మానవహారం, నిరసన ర్యాలీ నిర్వహించారు. మత ప్రాతిపదికన మహిళల హక్కులను కాలరాసే ప్రయత్నాలను నిరసిస్తూ మే 16న వేలాది మంది మహిళా హక్కుల కార్యకర్తలు పార్లమెంట్ సమీపంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఇటీవల దుర్గామాత ఆలయంపై జరిగిన దాడి నేపథ్యంలో, బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీల భద్రతను అమలుపరచాల్సిన బాధ్యత ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వంపై ఉందని జూన్ 27న భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. తాజా ఘటనతో మైనారిటీల భద్రత అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# సంపాదకీయం

## మార్చే యత్నం.. మారిన సీఎం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో మార్పు కనిపిస్తోంది. మంత్రులతో నిర్మొహమాటంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. పార్టీ సమావేశాల్లో కూడా తన మనసులోని మాటను సూటిగా చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఆయా శాఖల పనితీరుపై సమీక్షలు మొదలెట్టారు. అదే సమయంలో మంత్రులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని, స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాల్సిన బాధ్యత మంత్రులపైనే ఉంటుందని స్పష్టంచేస్తున్నారు. ..కొంత మంది మంత్రులు, నాయకులు పార్టీ అధిష్ఠానానికి ముఖ్యమంత్రిపై ఫిర్యాదులు చేయడం ఎక్కువైంది. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మార్చడం అవసరమని కాంగ్రెస్ అగ్రనాయకత్వం అభిప్రాయపడేలా చేశారు. ఆయన నాయకత్వంలో స్థానిక ఎన్నికలకు వెళ్లలేమని ఫిర్యాదు చేశారు. ఎన్నికల నాటితో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బలహీనపడిందని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అలవాటు ప్రకారం అసంతృప్తులనే ప్రోత్సహించింది. ...నాయకత్వంలో లోపాలు గుర్తిస్తే వాటిని సరిదిద్దుకోవడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి గానీ ఏకంగా నాయకత్వాన్నే మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని క్షేత్ర స్థాయి నుంచి కూడా పార్టీ అధిష్ఠానానికి అభిప్రాయాలు అందాయి. దీంతో రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మార్చాలన్న అభిప్రాయానికి పార్టీ అధిష్ఠానం స్వస్తి చెప్పింది. కేసీఆర్ హయాంలో విచ్చలవిడిగా వేల సంఖ్యలో ప్రత్యర్థుల ఫోన్లను దొంగచాటుగా, అక్రమంగా విన్నప్పటికీ కేసీఆర్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయారు. ఇక నాకు సంబంధించినంత వరకు రెండేళ్ల కాల్ డేటా తెప్పించుకున్నారు. ఇది అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలకు విరుద్ధం. మావోయిస్టులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారి జాబితాలో నా నంబర్ చేర్చారు. నా ఫోన్ మాత్రమే కాదు, మరికొందరు మీడియా యజమానుల ఫోన్లనూ ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులకు న్యాయం జరగాలన్నా, నిందితులకు శిక్ష పడాలన్నా సుప్రీం పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలి. ఈ అరాచకానికి కర్త, కర్మ, క్రియ నాటి సీఎం కేసీఆర్ అన్నది అందరికీ తెలిసిందే. కేసీఆర్ అండ్ కో సేఫ్ గా ఉంటారా? జైలుకు వెళతారా? అన్నది కాలమే చెప్పాలి! తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో మార్పు కనిపిస్తోంది. ఏడాదిన్నర క్రితం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఇంత కాలంగా అనేక సందర్భాలలో టేకిట్ ఈజీ ధోరణి ప్రదర్శించారు. సహచర మంత్రులతో స్నేహపూర్వకంగా వ్యవహరించారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ క్రమంలో పలువురు మంత్రులు, అధికారులు అదుపు తప్పారు. ఫలితంగా ముఖ్యమంత్రికి ప్రభుత్వంపై పట్టు రాలేదన్న విమర్శలు వినిపించాయి. దీంతో రేవంత్‌రెడ్డి ఇటీవలి కాలంలో మంత్రులు, శాసనసభ్యులతో కొంత నిర్మొహమాటంగా వ్యవహరించడం మొదలుపెట్టారు. పార్టీపై, ప్రభుత్వంపై పట్టు సాధించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మార్పు అకస్మాత్తుగా వచ్చింది కాదు. ముఖ్యమంత్రిలో ఈ తెగింపు రావడానికి కారణం ఏమిటి? ముఖ్యమంత్రిగా తన స్థానం పదిలం చేసుకోవాలని ఎందుకు నిర్ణయించుకున్నారు? అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. ఆయనలో ఈ మార్పు రావడానికి సహచర మంత్రులతో పాటు సొంత పార్టీ నాయకులు, పార్టీ అధిష్ఠానం కూడా కారణమని స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రిగా ఆయనకు తగినంత స్వేచ్ఛ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇబ్బందులపాల్జేసింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, పార్టీ అధిష్ఠానానికి మధ్య అంతరం ఏర్పడిందన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్న ప్రచారం కూడా జరిగింది. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఉన్న సమయంలోనే రాహుల్‌గాంధీ ఆయనను కలుసుకోకుండా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలుసుకోవడం ఈ వార్తలకు బలం చేకూరింది. ఈ క్రమంలో పార్టీ అధిష్ఠానానికి మళ్లీ సన్నిహితం అవడానికి ఆయన తన వంతు ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కొంత మెత్తబడింది. అయితే, అదే సమయంలో కొంత మంది మంత్రులు, నాయకులు పార్టీ అధిష్ఠానానికి ముఖ్యమంత్రిపై ఫిర్యాదులు చేయడం ఎక్కువైంది. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చడం అవసరమని కాంగ్రెస్ అగ్రనాయకత్వం అభిప్రాయపడేలా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫైర్ బ్రాండ్ లీడర్‌లా వ్యవహరించిన రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రిగా ఆ స్థాయిలో వ్యవహరించకపోవడం వాస్తవం. ఇందుకు అనేక కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనది కాంగ్రెస్ అధిష్ఠానమే. కాంగ్రెస్ సంస్కృతిని అవగాహన చేసుకోవడానికి ఆయనకు కొంత సమయం పట్టింది. ముఖ్యమంత్రిగా అనేక పరిమితుల మధ్య పనిచేయవలసి వచ్చింది. అయినా కాంగ్రెస్ అధిష్ఠానం మనసెరిగి వ్యవహరించడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆయన నాయకత్వ ప్రతిభపై నీలినీడలు కమ్ముకున్నాయి. ముఖ్యమంత్రిగా ఉండి కూడా కొంత మంది మంత్రుల శాఖల్లో జోక్యం చేసుకోలేని విధంగా పార్టీ అధిష్ఠానం ఆరంభంలోనే ఆంక్షలు విధించింది. రేవంత్‌రెడ్డి కూడా కొన్ని సందర్భాలలో తొందరపాటు ప్రదర్శించారు. అందరూ తనవాళ్లే అన్నట్టుగా తన మనసులోని అభిప్రాయాలను అందరి ముందూ బయటపెట్టేవారు. దీంతో పార్టీలోని రేవంత్‌రెడ్డి ప్రత్యర్థులు తమ వ్యూహాలకు పదునుపెట్టారు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందని పార్టీ అధిష్ఠానానికి నూరిపోశారు. ఆయన నాయకత్వంలో స్థానిక ఎన్నికలకు వెళ్లలేమని ఫిర్యాదు చేశారు. ఎన్నికల నాటితో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బలహీనపడిందని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అలవాటు ప్రకారం అసంతృప్తులనే ప్రోత్సహించింది.

# ఐదు గ్రామాల అంతులేని గోస

రెండు దేశాల మధ్య సరిహద్దు సమస్య గురించి ప్రజలు గోసపడితే ఆశ్చర్యపోనవసరం లేదు. అది సర్వసాధారణం. అయినప్పటికీ, భారత్, బంగ్లాదేశ్‌కు మధ్య కొన్ని గ్రామాల విషయంలో సమస్య తలెత్తినప్పుడు రెండు దేశాలు సామరస్యంగా పరిష్కరించుకున్నాయి. కానీ, ఆంధ్రప్రదేశ్ పునర్విభజనలో భాగంగా ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన ఐదు గ్రామాల ప్రజలు మాత్రం స్వదేశంలో పరాయివాళ్లుగా, ద్వితీయ శ్రేణి పౌరులుగా నివసిస్తున్నారు. అందరూ ఉన్నా అనాథలుగా బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. వాళ్లు సాంకేతికంగా ఆంధ్రాలో ఉన్నప్పటికీ మానసికంగా తెలంగాణలోనే ఉన్నారు. విభజనకు పూర్వం భద్రాచలంలో అంతర్భాగమైన ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం గ్రామాల ప్రజలకు భద్రాచలంతో పేగుబంధం ఉన్నది. అశాస్త్రీయంగా ఏపీలో కలిపిన ఈ గ్రామాలు పోలవరం ముంపు జాబితాలో, ప్యాకేజీ జాబితాలోనూ లేవు. అశాస్త్రీయంగా ఈ గ్రామాలను విలీనం చేయడం వల్ల దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. భద్రాచలం నుంచి పర్ణశాలకు వెళ్లాలంటే ఆంధ్రాలో కలిపిన ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో 9 కిలోమీటర్లు ప్రయాణించాలి. దీంతో భద్రాచలం నుంచి పర్ణశాల వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే భద్రాచలం నుంచి అంబులెన్స్ రావడం లేదు. ఆంధ్రా నుంచి రావాలి. అందుకు కొన్ని గంటల సమయం పడుతుంది. జిల్లా కేంద్రమైన పాడేరుకు వెళ్లాలంటే రెండు ఘాటు రోడ్లు దాటుకుంటూ 420 కిలోమీటర్లు ప్రయాణించాలి. అత్యవసర సేవల కోసం 80 కిలోమీటర్లు ప్రయాణించి చింతూరులోని ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తున్నది. ఏదైనా సమస్య వచ్చి ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లాలంటే నియోజకవర్గ కేంద్రమైన రంపచోడవరానికి 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తున్నది. మన రాజ్యాంగ పీఠికలో మనది ప్రజాస్వామ్య దేశమని ఒంటుంది. కానీ, ఆ గ్రామాల్లో ప్రజాస్వామ్యం లేదు, పాలన అసలే లేదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఈ గ్రామాల్లో ప్రచారం చేయరు. ఈ గ్రామాల్లో ఓ ట్లు అడగటానికి రారు. ఒకవేళ రావాలనుకున్నా హెలికాప్టర్ తప్ప, వేరే మార్గం లేదు. ఈ గ్రామా ల ప్రజలు నాయకులకు సమస్యలు విన్నవించుకునే పరిస్థితి ఉండదు. ఒకవేళ ఎంపీని కలవాలంటే 2 రోజులు ప్రయాణం చేయాల్సిందే. ఇదే కాక ఈ సాంకేతిక సమస్య వల్ల భద్రాచలం అభివృద్ధి సైతం కుంటుపడుతున్నది. భద్రాచలంకు ఒకవైపు గోదావరి మూడు వైపులా ఆంధ్ర ఉండటం వల్ల పట్టణంలో డంపింగ్ యార్డుకు జాగ లేక గత పదకొండేండ్లుగా గోదావరి నదిలోనే చెత్త వేస్తున్నారు. దీంతో గోదావరితోపాటు భద్రాచలం పట్టణంలోని కొన్ని కాలనీలు కాలుష్యమయం అవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఈ గ్రామాల విద్యార్థుల చదువులు భద్రాచలంలోనే కొనసాగాయి. అనాలోచితంగా తీసుకున్న విలీన నిర్ణయం మూలంగా ఇప్పుడు ఆ విద్యార్థులు స్థానికేతరులు అవుతున్నారు. పుట్టి పెరిగిన ఊరిలో సైతం సాంకేతికంగా స్థానికేతరులు అవ్వడంతో ఎటుకాని పక్షులు అవుతున్నారు. ఆంధ్రాలో ఈ గ్రామాల ప్రజలను పరాయివాళ్లుగా చూస్తున్నారు. స్వరాష్ట్రంలో సాంకేతికంగా వెలివేయబడి 11 ఏండ్లుగా నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ ఐదు గ్రామాల ప్రజలే కాదు, భద్రాచలం




రామయ్య ఆల యం కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. రామయ్య 14 ఏండ్ల వనవాసం తర్వాత పట్టాభిషిక్తుడయ్యాడు. కానీ, 11 ఏండ్లుగా ఆ ఐదు గ్రామాల ప్రజలు వనవాసమేగుతున్నారు. గొల్లకొండ నవాబు అబుల్ హసన్ కుతుబ్ షాను ఎదిరించి ఆనాడు భక్తరామదాసు ఆలయాన్ని నిర్మించి సీతారాములకు ఆభరణాలు చేయించాడు. మాన్యం భూములు, ఆస్తులు సైతం నెలకొల్పాడు. కానీ, నేడు ఆ ఆస్తులను శ్రీరాముడి భద్రాచల ఆలయం అనుభవించలేని దుస్థితి దాపురించింది. కనుల పండువగా బాల రాముడికి అయోధ్యలో అత్యంత భవ్యమైన రామాలయం ఏర్పాటైంది. కానీ, మన భద్రాచల శ్రీరాముడి మాన్యం మాత్రం రాముడికి దక్కడం లేదు. వనవాసంలో అత్యంత ఎక్కువ కాలం రెండున్నర ఏండ్లు మన భద్రాచలంలోనే సీతారాములు గడిపారని పురాణాలు చెప్తున్నాయి. భద్రాచలం సీతారాముల ఆలయం తెలంగాణలోనే ఉంది. కానీ, రాములవారి 917 ఎకరాల భూములు మాత్రం ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామ పంచాయతీల్లో ఒకటైన పురుషోత్తపట్నంలో ఉన్నాయి. ఆ ఐదు గ్రామ పంచాయతీలు ఏపీలో ఉండటం వల్ల భద్రాచలం ఆలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. రావణుడు సీతమ్మను ఎత్తుకెళ్తుంటే రావణున్ని ఎటపాక గ్రామంలోనే జటాయువు అడ్డుకుంది. ఉష్ణ గుండం వద్ద సీతమ్మ తల్లి స్నానమాచరించిన పవిత్ర స్థలం గుండాల గ్రామం వద్దనే ఉంది. వీటన్నింటిపై పక్క రాష్ట్రానికి అధికారాలు ఉండటం, తెలంగాణకు వాటిపై అధికారం, పట్టు లేకపోవడంతో భద్రాచల ఆలయ అభివృద్ధి కుంటుపడటమే కాకుండా, పర్యవేక్షణ కొరవడుతున్నది. ఆలయం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నది. సీతారాములు నడియాడిన ఆ ఐదు గ్రామాల్లో ఒక్కో గ్రామంలో ఒక్కో ఆనవాలు ఉన్నది. శ్రీరాముడి ఆలయాన్ని ఒక రాష్ట్రంలో, రాముడి మాన్యం, ఆనవాళ్లు మరొక రాష్ట్రంలో పెట్టి ఆలయానికి, ఆస్తులకు సంబంధం లేకుండా చేయడం శ్రీరాముడికి ద్రోహం చేయడమే అవుతుంది. శ్రీసీతారాముల ఆనవాళ్లను, వాళ్లు నడయాడిన ప్రతీ అడుగును ఒకే రాష్ట్రంలో ఉంచితే వాటిని ఒక పర్యాటక ప్రదేశంగా మలచవచ్చు. భద్రాచలాన్ని ఒక ఆధ్యాత్మిక నగరంగా మార్చే గొప్ప అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల భద్రాచలం, సాక్షాత్తు శ్రీరాముడే నిస్సహాయతకు గురవుతున్న దౌర్భాగ్యపు పరిస్థితి ఇది. ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కళతప్పి బోసిపోయింది. ఇక్కడి ప్రజలు పదకొండేండ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయారు. ఐదు గ్రామాల్లో పర్యటించిన వ్యక్తిగా ప్రజల గోసను, ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని చూసి నేను చలించిపోయాను. ఇంతటి అమానవీయ నిర్ణయంపై ప్రభుత్వం తక్షణమే సమీక్ష చేసి, ఆ ఐదు గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలి. ఇది రాజకీయ సమస్య కాదు. పార్టీల లొల్లి కాదు. ఇదొక మానవీయ సమస్య, సామాజిక సమస్య. ఆ మేరకు, రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మానవీయ కోణంలో ఆలోచించి, ప్రజాభీష్టం మేరకు ప్రధానమంత్రితో చర్చించాలి. ప్రధాని, ఏపీ ముఖ్యమంత్రి పెద్ద మనసుతో వారికి స్వాతంత్ర్యం కల్పించి ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి.త

# ఎనిమిదేళ్ల జీఎస్టీ...రాబడి లెక్కలేంటి?

భారతదేశ పరోక్ష పన్నుల వ్యవస్థలో అతిపెద్ద సంస్కరణ జీఎస్టీ. వస్తుసేవల రంగంలో కేంద్ర, రాష్ట్రాలు విధిస్తున్న బహుళ పరోక్ష పన్నుల స్థానంలో ఒకే ఒక పన్నుగా జీఎస్టీని 2017, జులై 1 నుంచి ప్రవేశపెట్టారు. ఇది రాష్ట్రాల ఆదాయాలపై ఎలాంటి ప్రభావం చూపుతోందనేది పరిశీలించాల్సిన అంశం. వస్తుసేవలు ఏ రాష్ట్రంలో వినియోగమవుతాయో ఆ రాష్ట్రానికే పన్ను సమకూరేలా జీఎస్టీ విధానాన్ని రూపొందించారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అనే ప్రత్యేక పద్ధతిలో పన్నుపై పన్ను విధించడాన్ని నివారిస్తూ- వ్యాపారులూ, వినియోగదారులకూ ప్రయోజనం కలిగేలా తీర్చిదిద్దారు. జీఎస్టీ వ్యవస్థలో నమోదవ్వని వ్యాపారుల నుంచి కొనే వస్తుసేవలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లభించదు. దీంతో అధిక సంఖ్యలో వ్యాపారులు నమోదుకు ముందుకొచ్చారు. 2017లో 98 లక్షలమంది వ్యాపారులు నమోదవ్వగా, వారి సంఖ్య ఎనిమిదేళ్లలో 1.5 కోట్లకు పెరిగింది. పెరుగుతున్న రిజిస్ట్రేషన్లకు తగ్గట్టు జీఎస్టీ ఆదాయం కూడా అధికమవుతోంది. 2018-19 (జీఎస్టీ ప్రవేశపెట్టిన తరవాత మొదటి పూర్తి సంవత్సరం)లో దేశవ్యాప్తంగా రూ.11,77,369 కోట్ల జీఎస్టీ వసూలైంది. అది 2024-25కు రూ.22,08,861 కోట్లకు పెరిగింది. వసూలైన మొత్తంలో కేంద్ర, రాష్ట్రాలకు సగం చొప్పున జమవుతుంది. రాష్ట్రాలకు జీఎస్టీ రెండు విధాలుగా వస్తుంది. మొదటిది రాష్ట్రం లోపల జరిగే కొనుగోళ్లు, అమ్మకాలపై విధించే పన్నులో 50శాతముండే ఎస్‌జీఎస్టీ. రెండోది అంతర రాష్ట్రాల మధ్య జరిగే కొనుగోళ్లు, అమ్మకాలపై విధించే ఐజీఎస్టీ. ఇందులో 50శాతం వస్తుసేవల వినియోగ ప్రాతిపదికన సెటిల్మెంట్ అనే ప్రక్రియ ద్వారా పంచే వాటా రూపంలో వస్తుంది.

### ఎన్నో చిక్కుముళ్లు

ఇప్పుడు జీఎస్టీ కేంద్రానికి, రాష్ట్రాలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. రాష్ట్ర పన్నుల ఆదాయంలో జీఎస్టీ వాటా 30-40శాతందాకా ఉంటుంది. మళ్లీ సెటిల్మెంట్ పద్ధతిలో ఐజీఎస్టీ వస్తుంది. సెటిల్మెంట్ మొత్తంలోని హెచ్చుతగ్గులు రాష్ట్రాల జీఎస్టీ ఆదాయ వృద్ధిని బాగా ప్రభావితం చేస్తున్నాయి. సెటిల్మెంట్ ప్రక్రియ సక్రమంగా లేదని, తమకు వస్తుసేవల వినియోగ ప్రాతిపదికన రావాల్సిన వాటా రావడం లేదని రాష్ట్రాలు అసంతృప్తిగా ఉన్నాయి. వ్యాపారులు వస్తుసేవలను ఎగుమతి చేసిన రాష్ట్రాల్లో చెల్లించిన ఐజీఎస్టీని, ఆ వస్తుసేవలను దిగుమతి చేసుకున్న రాష్ట్రాల్లోని వ్యాపారులు తమ పన్ను చెల్లింపుల్లో వినియోగించుకున్నప్పుడు, ఆ మేరకు ఐజీఎస్టీ దిగుమతి రాష్ట్రానికి బదిలీ అవుతుంది. వాడుకోకుండా మిగిలిపోయిన ఐజీఎస్టీ కూడా నిర్దిష్ట కాలం తరవాత తాత్కాలిక




ప్రాతిపదికన దిగుమతి రాష్ట్రానికి బదిలీ అవుతుంది. ఇలాంటి బదిలీ సెటిల్మెంట్‌లలో తప్పులు దొర్లుతున్నాయని, కొన్ని రాష్ట్రాలకు ఎక్కువగా, మరికొన్నింటికి తక్కువగా బదిలీ జరుగుతోందని ఫిర్యాదులు ఉన్నాయి. వాటిలో నిజం ఉందని అంగీకరించిన కేంద్ర ఆర్థిక మంత్రి, ఎక్కువగా బదిలీ అయిన ఐజీఎస్టీని ఆయా రాష్ట్రాలనుంచి కేంద్రం వెనక్కు తీసుకుంటుందన్నారు. ఐజీఎస్టీ సెటిల్మెంట్ ప్రక్రియను పరిశీలించడానికి ఏర్పాటైన అధికారుల కమిటీ నివేదికను బయటపెట్టనందువల్ల పూర్తి వివరాలు తెలియడం లేదు. అయితే ఐజీఎస్టీ బదిలీల్లో జాప్యం ఉండరాదని, బదిలీ చేసిన మొత్తం ఆ రాష్ట్రాల వస్తుసేవల వినియోగానికి తగినట్లుగా ఉండాలని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఐజీఎస్టీని తప్పులు లేకుండా త్వరితగతిన ప్రతినెలా రాష్ట్రాలకు బదిలీ చేసినప్పుడే వాటి జీఎస్టీ ఆదాయంలో స్పష్టత వస్తుంది. ఐజీఎస్టీ బదిలీల్లోని సమస్యలే కాకుండా దొంగ రిజిస్ట్రేషన్లు కూడా రాష్ట్రాల జీఎస్టీ ఆదాయాన్ని దెబ్బతీస్తున్నాయి. వ్యాపార సౌలభ్యం కోసం సులభతరం చేసిన నమోదు ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ, కొంతమంది తమకు కేటాయించిన జీఎస్టీ గుర్తింపు సంఖ్యతో, వస్తుసేవలు సరఫరా చేయకుండానే పెద్దసంఖ్యలో దొంగ బిల్లులు ఇతరులకు ఇచ్చి, వారు తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందే అవకాశం కల్పిస్తున్నారు. ప్రభుత్వాలు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నా, దొంగ రిజిస్ట్రేషన్ల నివారణకు క్షేత్రస్థాయి కార్యాలయాలకు తరచూ మార్గదర్శకాలు ఇస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దొంగ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, వాటిద్వారా పొందిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లను కూడా రద్దు చేయడం, ఎగవేసిన పన్నును వసూలు చేయడం క్షేత్రస్థాయి అధికారులకు నిత్యకృత్యంగా మారింది. ఇన్ని చిక్కుముళ్లు ఉండటంతో దొంగ రిజిస్ట్రేషన్‌ల బెడద, తద్వారా ప్రభుత్వాలకు భారీగా జీఎస్టీ ఆదాయ నష్టం కొనసాగుతూనే ఉంది. దీనికి పూర్తి పరిష్కారం దొరికినప్పుడే రాష్ట్రాల జీఎస్టీ ఆదాయం స్థిరపడుతుంది.

### పరిష్కరించాల్సిన సమస్యలు

సెటిల్మెంట్ ప్రక్రియలోని తప్పులు, దొంగ రిజిస్ట్రేషన్లతోపాటు, పన్ను చెల్లింపుదారులు అనేక ఇతర పద్ధతుల్లో ఎగవేతకు పాల్పడటం కూడా రాష్ట్రాల జీఎస్టీ ఆదాయంలో ఒడుదొడుకులకు కారణమవుతోంది. పన్ను ఎగవేతను అరికడితేనే రాష్ట్రాల జీఎస్టీ ఆదాయం పెరుగుతుంది. 2020-21 నుంచి 2024-25 జనవరి వరకు 86,711 కేసుల్లో రూ.6,79,505 కోట్ల జీఎస్టీ ఎగవేతను, 42,673 కేసుల్లో రూ.1,66,241 కోట్ల తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్లను గుర్తించినట్లు కేంద్రం పార్లమెంటుకు వెల్లడించింది. కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ విభాగాలు సమర్థంగా ఎగవేతకు అడ్డుకట్ట వేయకపోతే ఆదాయానికి గండిపడుతుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఎదుగుతూ, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతున్నకొద్దీ జీఎస్టీ ఆదాయం పెరుగుతుంది. రాష్ట్ర ఆర్థిక స్థితి, ప్రజల కొనుగోలు శక్తి జీఎస్టీ ఆదాయంపై ప్రభావం చూపే బాహ్య కారణాలైతే, ఐజీఎస్టీ సెటిల్మెంట్‌లో జరిగే పొరపాట్లు, దొంగ రిజిస్ట్రేషన్లు, పన్ను ఎగవేతలు వంటివి అంతర్గత కారణాలు. ఇలాంటి సమస్యలను సమర్థంగా పరిష్కరిస్తేనే, జీఎస్టీ ఆదాయం ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితికి తగినట్లుగా పెరుగుతుంది.

# తెలుస్తోందా... సామాజిక సంక్షోభమిది!

'నేను నిద్రపోవాలనుకుంటున్నాను కానీ, కళ్లు మూతలు పడితేనేగా! కోమాలోకి పోయినా బాగుణ్ను.. అమ్నీషియా లాంటిది ఏదో వచ్చి జ్ఞాపకశక్తి అంతా పోతే ఇంకా బాగుంటుందేమో. అలాంటిదేదో రావాలి నాకు... పదేపదే గుర్తుకొస్తూ నరకం చూపిస్తున్న ఆ పీడకలలోంచి బయటపడాలంటే అదొక్కటే మార్గం. బుర్ర నిండా అవే ఆలోచనలు... కొంపదీసి అతను నా మెదడును కూడా రేప్ చేశాడా ఏంటి?'- ఇలా ఓ అత్యాచార బాధితురాలు ఎదుర్కొనే ట్రామా మొత్తాన్నీ తన 'స్పీక్' నవలలో అక్షరీకరించారు లారీ హాల్స్ అండర్సన్. ఆ నవలలోని మెలిండా మనోవేదన- పాఠకుల మనసులను మెలిపెట్టేస్తుంది. అలాగని అదంతా రచయిత్రి సొంతంగా కల్పించి రాసింది కాదు. నరరూప రాక్షసుల పైశాచికత్వానికి బలైపోతున్న అసహాయ మహిళల కన్నీటి ధారలనే సిరాగా మార్చుకుని రాసిన అక్షరాలవి! రెండు రోజుల క్రితం కోల్‌కతాలో తన కళాశాల ప్రాంగణంలోనే హేయ లైంగిక దాడికి గురైన న్యాయ విద్యార్థిని గోడును ఆలకించినా సరే- మనుషుల్లో మానవత్వమెంతగా అడుగంటిపోతోందో అర్థమవుతుంది. 'కాళ్లుపట్టుకుని ప్రాధేయపడినా కనికరం చూపించలేదు... ఊపిరందక ప్రాణంపోయేటట్టున్నా జాలిచూపించలేదు... పెనుగులాడితే హాకీస్టిక్‌తో కొడుతూ, వీడియో తీస్తూ అత్యాచారం చేశారు' అంటూ 24ఏళ్ల ఆ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పదినెలల కిందట కోల్‌కతాలోనే ఆర్.జి.కర్ ప్రభుత్వాసుపత్రి-వైద్యకళాశాలలో జూనియర్ వైద్యురాలి హత్యాచారం జరిగింది. ఆ జుగుప్సాకర నేర గాయం ఇంకా జాతి గుండెల్లో పచ్చిగా ఉండగానే- అదే నగరంలో మరో కళాశాలలో ఇంకొక దారుణం! న్యాయాన్యాయాలపై పాఠాలు చెప్పే చోట చోటుచేసుకున్న ఈ అమానుష ఘటన- అత్యాచారాల విషసంస్కృతి పాకని ప్రదేశమేదీ మన దేశంలో లేదని చాటిచెబుతోంది. చట్టాలు చేస్తే చాలు, నేరాలు అవే తగ్గిపోతాయనుకుంటున్న నాయకుల నిష్ప్రయోజకత్వాన్ని బోనులో నిలబెడుతోంది. అంతకుమించి విలువల



పతనంలో నానాటికీ పాతాళానికి చేరుతున్న మన సమాజ దౌర్భాగ్యాన్ని పట్టిచూపుతోంది! ఒక మహిళ ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలోనైనా స్త్రీలకు కనీసపాటి రక్షణ ఉంటుందని, ఉండాలని అనుకోవడంలో తప్పేమీ లేదు. కానీ, మమతాబెనర్జీ పాలనలోని పశ్చిమ్ బెంగాల్‌లో అలాంటి సురక్షిత వాతావరణాన్ని ఆశించడమంటే- ఎండిపోయిన బావిలో నీళ్లకోసం దేవులాడినట్లే! ఆర్.జి.కర్ ఆసుపత్రిలో యువ వైద్యురాలిని చెరిచి చంపేయడంపై దేశవ్యాప్తంగా గగ్గోలు రేగినప్పుడు మమత ఏం చేశారు? రోడ్డెక్కి ర్యాలీతీశారు. నిందితుడికి ఉరిశిక్ష విధించాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు బాధ్యత వహించాల్సిన పదవిలో ఉన్న ఆమె- ప్రతిపక్ష నాయకురాలి మాదిరిగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఇలా నాటకీయతను రక్తికట్టించడానికే నాయకులు పరిమితమవుతుంటే- రక్తమోడుతున్న ఆడపిల్లల గురించి ఆలోచించేదెవరు? నిరుడు అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబరు నాలుగో తేదీ మధ్యలోనే పశ్చిమ్ బెంగాల్‌లో పది అత్యాచారాలు వెలుగుచూశాయి. ఏడు నెలల పసిపాప, కొత్తగా పెళ్లయిన అమ్మాయి... బాధితురాళ్లలో ఒక్కొక్కరిదీ ఒక్కో విషాదగాథ. మొన్న జనవరిలో దక్షిణ 24 పరగణాల జిల్లాలో 14 ఏళ్ల చిన్నారిని అపహరించి అత్యాచారం చేసి చంపేసి వరిపొలంలో పాతిపెట్టేశారు దుర్మార్గులు. ఇలా ఎన్నో ఘోరాలు జరుగుతుంటే, ఆ రాష్ట్ర పోలీసులు ఏం చేస్తున్నారు? జనాభాకు తగినట్లుగా అసలక్కడ పోలీసులు ఉంటేనే కదా ఏమైనా చేయడానికి! ఒక నివేదిక ప్రకారం, పశ్చిమ్ బెంగాల్‌లో కానిస్టేబుళ్ల పోస్టుల్లో 40శాతానికి పైగా ఖాళీలు పేరుకుపోయాయి. 27శాతానికి పైగా అధికారుల పోస్టులూ భర్తీకావాల్సి ఉంది. ఖాకీ యంత్రాంగాన్ని బలహీనం చేసింది చాలక- తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ వంటివారు 'ఎవడో ఒకడు తన ఫ్రెండ్‌ను రేప్ చేస్తే పోలీసులు ఎలా అడ్డుకోగలరు' అనే చిల్లర మాటలతో తమ చేతకానితనాన్ని సమర్థించుకుంటున్నారు. ఇక న్యాయ విద్యార్థినిపై అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు మమత పార్టీ విద్యార్థి విభాగం మాజీ నేత. అతగాడిపై గతంలోనే పలు నేరాభియోగాలున్నాయి. అలాంటి వాళ్లను చంకనేసుకుని తిరుగుతున్న రాజకీయ పార్టీలే మన దేశానికి పెద్ద శాపాలసలు! నేరగాళ్లకు ఉరిశిక్షలు విధిస్తే అత్యాచారాలు అవే తగ్గిపోతాయండీ అంటూ చాలామంది చచ్చుపుచ్చు సలహాలిస్తుంటారు. మమతతో సహా పలువురు నేతలూ అదే పాట పాడుతుంటారు. దిల్లీలో నిర్భయ దారుణోదంతం తరవాత చట్టాలను ఆ మేరకు పదును పెట్టారు. పశ్చిమ్ బెంగాల్‌లోనే మొన్న ఫిబ్రవరిలో ఓ రేప్‌కేసు నిందితుడికి ఉరిశిక్ష పడింది. కానీ, ఏం లాభం? ఆడపిల్లలపై అకృత్యాలు ఏమైనా ఆగాయా అక్కడ? నిర్భయ ఘటన జరిగిన 2012లో దేశవ్యాప్తంగా 24,519 అత్యాచారాల కేసులు నమోదయ్యాయి. 2022లో అవి 31,516కు పెరిగాయి.

# కుర్మావతారం లో జగన్నాధ స్వామి.



అనకాపల్లి, : అనకాపల్లి గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ్ స్వామివారి రథయాత్ర మహోత్సవ భాగంగా గూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రజ్యుమ్న హాలు వద్ద కొలువైన సుభద్రా బరభద్ర జగన్నాథ స్వామి వారు శనివారం భక్తులకు కూర్మావతారం లో దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో బొండా ప్రమీల ఆధ్వర్యంలో సుందరాకాండ పారాయణం జరిగింది. ఈ కార్యక్రమం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వహణ అధికారి బి మురళీ, ఆలయ కమిటీ ధర్మకర్తలు. బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాంద్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భగతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వివి సుబ్రహ్మణ్యం,బోడ్డేడ వెంకట చలపతిరావు,తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చి మొక్కలతో గవరపాలెం హైస్కూల్.



అనకాపల్లి,( : అనకాపల్లి గవరపాలం చిన్న హైస్కూల్ లో . 300 మంది పిల్లలు ఉంటున్నారు. స్కూల్ అంత మొక్కలు తో ఉంది. బాత్రూంలుకి డోర్లు లేవు. కుళాయిలు పనిచేయట్లేదు. వాటర్ ఫిల్టర్ మిషన్ పని చేయటము లేదు. ఆడపిల్లలు బాత్రూం డోర్స్, పని చేయటము లేదు గాంధీ విగ్రహం కూడా విరిగిపోయింది. చెత్త కూడా స్కూల్ అవరణ లో ఎక్కవగా ఉన్నది. తక్షణమే అధికారులు దుష్టి పెడతారని సరజన ఐక్య వేదిక, హ్యూమన్ రైట్స్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కోరిబిల్లి పరి కోరుచున్నారు.

# మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై దాడి అమానుషం

## జనసేన నేత గురాన అయ్యలు



విజయనగరం,: హైదరాబాద్ లోని మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై చోటు చేసుకున్న దాడి అమానుషమని జనసేన నేత గురాన అయ్యలు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహా న్యూస్ ఛానెల్ పై జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలు ఉంటే చట్టప్రకారం పోరాటం చేయాలన్నారు.. ఇలా దాడులకు పాల్పడటం సమంజసం కాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

# గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసానికి దూరం కారాదు

## రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు




విజయనగరం, : పాఠశాలలు మూసివేసిన కారణంగా విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్న వార్త కథనాలపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు స్పందించారు. అరుకు మండల పరిధిలో పాఠశాలలు ఉపాధ్యాయులు లేని కారణంగా మూసివేసినట్లు వచ్చిన వార్తా కథనాలపై ఆయన స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులు గిరిజన విద్యార్థులు విద్యావకాశాలు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అరుకు మండలంలో లోతేరు పంచాయతీ పరిధిలోనే అత్యధికంగా పాఠశాలలు టీచర్ లేక మూతపడ్డాయని లోతేరు పంచాయతీ పరిధి వంతలగుడ, తోడుబం ద, ఈడారి, దంసానివలస, బొరకాలవలస, లండిగుడ, కాగువలస, తది తర పాఠశాలలు ఇప్పటికీ తెరుచుకోలేదనే పత్రిక కథనాలలో కథనాలు వచ్చాయి. వీటిపై చైర్మన్ శంకరరావు స్పందిస్తూ గిరిజన విద్యార్థులలో బడి ఈడు పిల్లలందరూ విద్యనభ్యశించేలా చూడాలన్నారు.ఆయా గ్రామాలలో విద్యార్థుల పాఠశాల విద్యపై క్షేత్ర స్థాయిలో విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాని కోరారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమైనందున , విద్యార్థులు పాఠశాలలకు వచ్చి చదువుకునేలా చూడాలన్నారు.వెంటనే అవసరమైన చోట ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలన్నారు

# పేదలకు అండగా సహాయనిధి: మంత్రి సంధ్యారాణి



/సాలూరు/ మన్యం జిల్లా.. : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన గిరిజన మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గారి చేతులు మీదుగా లబ్ధిదారులకు ?3,00,503 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ ముడు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం లో ప్రతి పాటి రాజారావు గారికి ?45,751 (సాలూరు) గుల్లిపల్లి రియానిషి శ్రీనిధి గారికి ?1,85,701 (పిట్టాడ ,మెంటాడ) ఎర్ర మురళి కృష్ణ గారికి ?85,000 ( పిట్టాడ , మెంటాడ ) మంజూరు చేయబడింది. మొత్తం ?3,00,503 విలువైన చెక్కులు లబ్దిదారుల చేతికి మంత్రి సంధ్యారాణి అందచేశారు. ఆనారోగ్య సమస్యల సమయంలో అందిన ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో దోహదపడిందని వారు పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా కృషి చేస్తుందని మంత్రి గుమ్మిడీ సంధ్యారాణి గారు అన్నారు. సీఎం శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ప్రతి వ్యక్తికి సహాయం అందించేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ పూర్తి



మన్యం జిల్లా.. : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారి, ఐ.టి.డీ.ఏ., పార్వతీపురం వారి ఆదేశాలకు అనుగుణంగా, ఐ.టి.డీ.ఏ పరిధిలోని షెడ్యూల్డ్ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియను తేదీ: 28.06.2025 న పారదర్శకంగా, గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా నిర్వహించారు. ఈ ప్రక్రియను ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ, పార్వతీపురం వారి కార్యాలయంలో 56 మందికి విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి ఆర్. కృష్ణవేణి గారు, ఉప సంచాలకురాలు (గి.సం.), శ్రీ కె. దేశ్, సూపరింటెండెంట్, మరియు శ్రీ కె. చంద్రబాబు గారు, ఏ టి డబ్ల్యూ ఓ పాల్గొన్నారు.

# సాలూరు కౌన్సిలర్ తాడి శంకరరావు, భవిరెడ్డి సత్యప్రసాద్ ,సాలూరు వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ గారి కుటుంబాన్ని పరామర్శించిన జడ్పీచైర్మన్ చిన్న శ్రీను గారు,మాజీ మంత్రి వర్యులు శ్రీ పీడిక రాజన్న దొర



/సాలూరు/ మన్యం జిల్లా..: ఇటీవల అనారోగ్యానికి గురై ప్రేమ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న సాలూరు 3వ వార్డు కౌన్సిలర్ తాడి శంకర్ రావు గారు కుమారుడు తాడి నాయుడు గారిని, ఇటీవల భవిరెడ్డి సత్య ప్రసాద్ బావ గారు మరణించించిన విషయం తెలుసుకుని వారి కుటుంబీకులను,సాలూరు మండల వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ గారి తండ్రి,స్వర్గీయ రెడ్డి తిరుపతి నాయుడు గారు (మాజీ జడ్పీటీసీ- సాలూరు) ఇదివరకు మరణించిన విషయం తెలుసుకుని రెడ్డి సురేష్ గారి కుటుంబ సభ్యులను ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్,వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు,భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గారు మరియు మాజీ డిప్యూటీ సీఎం పిడిక రాజన్న దొర గారు వెల్లి ప్రతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు . ఈ కార్యక్రమంలో.. మక్కువ జడ్పిటిసి మావుడి శ్రీనివాస నాయుడు గారు, గొర్లె జగన్ గారు, టౌన్ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు గారు,గిరి రఘు గారు,సాలూరు మండల పార్టీ ప్రెసిడెంట్ సువ్వాడ భరత్ శ్రీనివాస్ గారు,జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు గారు, కౌన్సిలర్ లు,సర్పంచ్ లు ,ముఖ్య నాయకులు, కార్యకర్తలు,పలువుర్ ప్రముకులు పాల్గొన్నారు.

# ఐదేళ్లు దాటిన బాలలందరినీ బడిలో చేర్చాలి

ఇంటింటి సర్వే ద్వారా బాలబాలికలను గుర్తించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

సార్వత్రిక విద్య ద్వారా చదువు కొనసాగాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్



విజయనగరం, ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 28 : ఐదేళ్లు నిండిన బాలబాలికలందరినీ బడిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్అం.బేద్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి, బడిలో చేరని పిల్లలను గుర్తించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో



ప్రవేశాలు, సార్వత్రిక విద్యపై వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని, జిల్లావ్యాప్తంగా ఎన్రోల్ మెంట్ స్పెషల్ డ్రైవ్, సర్వే చేపట్టాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 31 నాటికి ఐదేళ్లు పూర్తి అవుతున్న పిల్లలందరినీ విధిగా మొదటి తరగతిలో చేర్పించాలని చెప్పారు. 6 నుండి 15 సంవత్సరాల లోపు గల బాలబాలికలు అందరూ పాఠశాలలోనే ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిల్లలు వివరాలు విద్యాశాఖకు అందజేయాలని శిశు సంక్షేమ శాఖకు సూచించారు. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలందరూ వారు ఏ పాఠశాలలో చేరినది ఇంటింటి సర్వే నిర్వహించి తెలుసుకోవాలన్నారు. సర్వే జాబితాను, శిశు సంక్షేమ శాఖ అందజేసిన జాబితాతో సరి చూసి, పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, దానివల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకు తొలి ప్రాధాన్యత ఇచ్చే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులద్వారా నాణ్యమైన విద్య, సదుపాయలు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, వైద్య పరీక్షలు, మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం లాంటి పథకాలు అందుతాయని, వీటిని తల్లితండ్రులకు వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ పర్యవేక్షణకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది ఎన్రోల్ మెంట్ స్పెషల్ డ్రైవ్ మరియు సర్వే లో పాల్గొనాలని తెలిపారు. బడి మానేసిన విద్యార్థులను కూడా బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని అన్నారు.

### సార్వత్రిక విద్య ద్వారా చదువు కొనసాగాలి

చదువుకోని వారు, చదువు మధ్యలో మానివేసిన వారికి విద్యను అందించే సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. పదవ తరగతి ఫెయిల్ అయిన, బడి మధ్యలో మానివేసిన 14 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరిని ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి పరీక్ష, 10 ఉత్తీర్ణులైన వారికి, ఇంటర్మీడియట్ ఇంటర్మీడియట్ పరీక్ష వ్రాయుటకు అర్హులని, అటువంటి వారందరినీ తప్పనిసరిగా ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశాలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు, ప్రైవేట్ రంగంలో పనిచేసే ఉద్యోగులు, వృత్తి వ్యాపార రంగం, ఉపాధి హామీ కూలీలు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితర వివిధ రంగాలకు చెందిన వారు ఈ అవకాశం ద్వారా చదువు కొనసాగించి, విద్యార్హతలు పొందవచ్చునని సూచించారు. ఆయా శాఖలు తమ క్షేత్రస్థాయి సిబ్బందిని సార్వత్రిక విద్యాపీఠం ద్వారా విద్యార్హతలు పెంచుకొనేవిధంగా ప్రోత్సహించాలని చెప్పారు. అతి తక్కువ ఫీజులతో, జిల్లా వ్యాప్తంగా 60 ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అనంతరం సార్వత్రిక విద్యాపీఠం ప్రచార పోస్టర్ ను, కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ మాణిక్యం నాయుడు, జెడ్పి సిఈఓ బివి సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి అన్నపూర్ణ, డ్వామా పిడి శారదాదేవి, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జీవనరాణి, సమగ్ర శిక్ష ఏపిసి డాక్టర్ రామారావు, ఓపెన్ స్కూల్ కన్వీనర్ సన్యాశిరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల 5వ జాతీయ చెస్ ఛాంపియన్ షిఫ్ ఆటల పోటీలు లో గెలుపొందిన విజేతలకు ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ లో పాల్గొన్న మన సిరి సహస్ర (సిరమ్మ)







విజయనగరం(: మెసానిక్ టెంపుల్ లో జ్వాలా ముఖి, రాష్ట్ర చెస్ ఆర్గనైజేషన్ సి.ఇ.ఓ. ఆంధ్రప్రదేశ్ వారు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ జాతీయ చెస్ ఛాంపియన్ షిప్ ఆటల పోటీలు దివ్యాంగులకు తేది:24/06/2025 నుండి తేది:28/06/2025 వరకు జరుగు ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త గౌరవ శ్రీ మజ్జి శ్రీను వాసరావు (చిన్న శ్రీను)గారి కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర(సిరమ్మ) మరియు లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి గారు శని వారం నాడు ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ చేసారు. ఈ సందర్భంగా సిరమ్మ మాట్లాడుతూ మానసిక మేధో సంపతికి చెస్ వంటివి ఎంతగానో ఉపయోగ పడతాయని ప్రతీ ఒక్కరూ ఛాంపియన్ కావాలనిఆమె కోరారు. ఇక్కడకు 18 రాష్ట్రాలు నుండి 106 మంది వచ్చిన చెస్ క్రీడాకారు లందరికి శుభాకాంక్షలు తెలుపుతూ మరియు దివ్యాంగులకు ఇలాంటి గొప్ప పోటీలను విజయవంతంగా నిర్వహించిన జ్వాలాముఖి గారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఏ ఎస్ ఐ లకు ఎస్ ఐ లు గా ప్రమోషన్,



అనకాపల్లి, : విశాఖపట్నం రేంజ్ పరిధిలో నలుగురు ఎఎస్సైలకు ఎస్సైలుగా ప్రమోషన్స్ కల్పిస్తూ విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ జూన్ 28న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్స్ పొందిన వారిలో (1) బి.సురేష్ ను పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించగా (2) డి.సత్యారావును శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. (3) కి.శ్రీనివాసరావు (4) సర్దార్ ఖాన్ లను విజయనగరం జిల్లాకు కేటాయిస్తూ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, ఐపీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్స్ పొందిన ఏ ఎస్ ఐ లను రేంజ్ డిసీజీ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైగా ఉద్యోగొన్నతి వారిలో భోగాపురం పోలీసు స్టేషన్ నందు ఏ ఎస్ ఐ గా పని చేస్తున్న సర్దార్ ఖాన్ కూడా ఉన్నారు. ప్రమోషన్ పొందిన సర్దార్ ఖాన్ జూన్ 28న రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, ఐపీఎస్ రేంజ్ పోలీసు కార్యాలయంలో కలవగా, ఆయన అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ సర్దార్ ఖాన్ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనుండడంతో విజయనగరం జిల్లాకు కేటాయిస్తూ, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వద్ద రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 1982 సం.లో పోలీసుశాఖలో కానిస్టేబుల్ గా విధుల్లో చేరిన సర్దార్ ఖాన్, 2009 సం.లో ఏఎస్సై గాను, 2025 సం.లో ఎస్సై గా ప్రమోషన్స్ పొందారు.

# గొట్లాం బైపాస్ జంక్షన్లో గంజాయి పట్టివేత

- ఆరుగురిని అదుపులోకి తీసుకొని ,

1.2 కిలోగ్రాముల గంజాయి సీజ్ .

సీ. ఐ - జి.ఏ.వి రమణ

ఎస్.ఐ - యు.మహేష్



గజపతినగరం/ బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి ఏ వి రమణ ఆధ్వర్యంలో ఒడిస్సా నుంచి విజయనగరం గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను, వినియోగిస్తున్న ఒక వ్యక్తిని, ఒక జువెనైల్ ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై యు.మహేష్ విలేకరులకు తెలియజేశారు.వారి వివరములు: దోనక కీర్తి రాజకుమార్ , పోరాపు కుమార్ , మీసాల అఖిల్ వీరు ముగ్గురు పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గ్రామానికి చెందిన వారీగా, తడంగి రమేష్ ఒరిస్సా రాష్ట్రం రాయగడ జిల్లా ఇరుకుబడి గ్రామానికి చెందిన వాడని, ఎబిన్ శ్యామ్ గంజాయి సేవిస్తున్న వ్యక్తి కేరళ రాష్ట్రానికి చెందిన వాడని , మరొకరు జువెనైల్ గా తెలియజేశారు .వీరి వద్ద నుంచి 1.2 కేజీల గంజాయి ప్యాకెట్లు ,ఆరు సెల్ ఫోన్లు, ఒక మోటార్ వెహికల్ , వెయ్యి రూపాయల నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సి.ఐ జి.ఏ.వి రమణ ,ఎస్.ఐ యు మహేష్ తెలియజేశారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు విలేకరులకు తెలియజేశారు . ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ,సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ గంజాయి అక్రమంగా రవాణా చేసిన, క్రయవిక్రయాలు చేసిన , వినియోగించిన అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం



విజయనగరం :ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ ,సీతం ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా జూలై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నామని సీతం ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ ఎం శశిభూషణరావు పేర్కొన్నారు .తోట పాలెం సత్య విద్యా సంస్థల వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమం యొక్క ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించి మాట్లాడుతూ వైద్యులు ప్రాణదాతలని ,సమాజంలో వారి స్థానం ఎల్లప్పుడూ గౌరవప్రదంగానే ఉంటుందని అన్నారు. సాంకేతికంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలతో ప్రపంచం ముందుకు వెళుతుందని ఈ నేపథ్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై జాతీయ వైద్యుల దినోత్సవం నాడు ప్రముఖ వైద్యులతో అవగాహన కల్పిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురు ప్రసాద్ , సత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి దేవమణి తదితరులు పాల్గొన్నారు

# 36వ వార్డు వైఎస్ఆర్సిపి అడ్డా

వార్డు ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్దుల్ షకీల్ కి అభినందనలు

వార్డు సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్



విశాఖపట్నం: దక్షిణ నియోజకవర్గంలో 36వ వార్డు పక్కా వైఎస్ఆర్సిపి అడ్డా అని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. జగన్మోహన్ రెడ్డి అభిమాన కార్యకర్తలకు ఉన్న వార్డులో నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహమ్మద్ అబ్దుల్ షకీల్ కి వాసుపల్లి అభినందనలు తెలిపారు. ఆశీలమెట్ట కార్యాలయంలో శనివారం 36వార్డు సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టేలా ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. జగన్మోహన్ రెడ్డి 2.0 విధానంతో ముందుకు వెళ్తున్నారని, భవిష్యత్తులో వైఎస్ఆర్సిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు ఎన్ని కుతంత్ర రాజకీయాలు చేసిన ఎవరు భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజల పక్షాన న్యాయపోరాటం చేసేందుకు వైఎస్ఆర్సిపి సిద్ధంగా ఉందని వాసుపల్లి తెలిపారు. 36వ వార్డులో పార్టీనీ వీడి వెళ్లిపోయిన కార్యకర్తలు మళ్లీ తిరిగి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో గుర్తింపు లేక నేతలు కార్యకర్తలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. వైఎస్ఆర్సిపిని మరింత బలోపేతం చేసే విధంగా ఐక్యతతో ముందుకు వెళ్లాలని వాసుపల్లి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో దక్షిణ చేనేత విభాగం అధ్యక్షరాలు కాకి పద్మ , దక్షిణ వాణిజ్య విభాగం అధ్యక్షులు కడియం ప్రసాద్, సాగర్, జమీల్, కిషోర్,చెన్నా శ్రీధర్,శత్రువు,సత్యం,స్వప్న, భాను, కనకమహాలష్మి,జాహు ఫరాలీ, ఎండి మెహరుల్లా, జే ఎంపీ అనీస్, క్రజో, డీ లియాక్వాట్, షోబీర్, డాక్టర్ అజీజోలువా, కె.సుబ్రహ్మణ్యం, కె. మాదవ, కె.రాజు, ఎండి సలీమ్, అనీస్,షాబీర్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉర్దూ పాఠశాల పరిశీలన..

## మాజీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్



తెలంగాణ బ్యూరో : ఘట్కేసర్ ఉర్దూ పాఠశాలను సందర్శించామని మాజీ చైర్ పర్సన్ మురళి పావని జంగయ్య యాదవ్ అన్నారు. శనివారం ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల ని సందర్శించి పరిస్థితులు గమనించిన ఘట్కేసర్ మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి , విద్య కు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని కావున విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయి కి చేరుకోవాలని కోరుతూ పట్టణం లో నిరుపయోగంగా ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల ని పరిశీలిస్తూ ఘట్కేసర్ మున్సిపల్ లోని ముస్లిం సోదరులు అదేవిధంగా చుట్టూ ప్రక్కల గ్రామ ముస్లిం సోదరా సోదరి మణులు ఈ యొక్క పాఠశాల ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్ , మొయినార్టీ అధ్యక్షుడు ఫరూక్ , నాయకులు శాశ బేగం , ఖయ్యూం , రఫిక్ , గఫ్ఫార్ , శానవాజ్ , తదితరులు పాల్గొన్నారు....

# మహిళా సర్పంచులకు ప్రత్యేక శిక్షణా తరగతులు..

## - ఎంపీడీవో వెంకన్న బాబు



రావిమతం : మహిళా సర్పంచులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30 నుంచి జూలై రెండు వరకు నర్సీపట్నం ఎంపీడీవో కార్యాలయం నందు ప్రభుత్వం శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిక్షణా తరగతులకు మండలంలో గల మహిళా సర్పంచులందరూ హాజరుకావాలని ఆయన తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో మహిళా సర్పంచులందరూ కు సర్పంచుల యొక్క విధులు, బాధ్యతలు తోపాటు గ్రామ పరిపాలన విధానంలో తగు సూచనలు సలహాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు హాజరయ్యేటప్పుడు మీ యొక్క ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్ తో పాటు హాజరుకావాలని ఆయన కోరారు.

## డాక్టరేట్ సేవా రత్న నేషనల్ అవార్డు అందుకున్న యలమంచి ఉదయ్ కిరణ్




శేరిలింగంపల్లి, : తెలంగాణ రాష్ట్ర నుండి హైదరాబాద్ మియాపూర్ కి చెందిన యలమంచి ఉదయ్ కిరణ్‌కు జాతీయ స్థాయి గౌరవాలు,సేవలో నిబద్ధతకు గుర్తింపు గౌరవ హానరీ డాక్టరేట్ సేవా రత్న నేషనల్ అవార్డు అందుకోవడం సామాజిక సేవ పట్ల నిబద్ధతతో, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తు ప్రజల మన్ననలు అందుకుంటున్న మియాపూర్ కి చెందిన యువ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్ ఇటీవల రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ గౌరవాలను అందుకోవడం తెలంగాణకు చెందిన మియాపూర్ గర్వకారణంగా నిలిచారని అన్నారు.స్వీకరించిన అవార్డ్స్ లలో ఇంటర్నేషనల్ జి హెచ్ పి యూనివర్సిటీ నుండి గౌరవ హానరీ డాక్టరేట్ (సోషల్ వర్క్ లో) సేవా రత్న జాతీయ అవార్డు %-% ప్రజాసేవలో అంకిత భావానికి గుర్తింపు. ఈ గౌరవాలు చెన్నైలోని భారతీయ విద్యా భవన్ వేదికగా, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, ప్రముఖ ఐఎఎస్ అధికారులు, కమిషనర్,ప్రిన్సిపల్ సెక్రటరీ ,మాజీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్,లెఫ్టినెంట్ కర్నల్ (రిటైర్), భారత శిక్షా రత్న అంతర్జాతీయ కమిషనర్ %-% యువ వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ డైరెక్టర్,ఇండియన్ ఆర్మీ,ఎడ్యుకేషన్ అంబాసిడర్ సమక్షంలో ప్రదానం చేయబడ్డాయి.ఈ సందర్భం గా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ.. ఈ గౌరవం నా వ్యక్తిగతం కాదు మనం కలిసి చేసిన ప్రతి సేవా యాత్రకు గుర్తింపు,ప్రతి వాలంటీర్,మార్పు కోసం నడిచిన ప్రతి ఒక్కరికి ఈ పురస్కారాలు అంకితం అని అన్నారు.సేవా ప్రస్థానంలో కీలక కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, జ్యామితి బాక్సులు పంపిణీ చలివేంద్రాలు,మియాపూర్ డివిజన్‌లో వేసవిలో ఉచిత తాగునీరు వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ,పోషకాహార పరిరక్షణ,మెగా మెడికల్ క్యాంపులు, ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ అనాథ ఆశ్రమాల్లో ఆహార పంపిణీ,ఆరోగ్యకరమైన భోజనాలు వికలాంగుల కోసం ప్రత్యేక అవసరాల అవసరమైన సామగ్రి పంపిణీ కార్మికులకు ఫుడ్ డ్రైవ్ %-% ఫ్రంట్‌లైన్ వర్కర్లకు కృతజ్ఞత సమ్మర్ కూలింగ్ స్టేషన్లు ప్రతి వేసవిలో విశ్రాంతి కేంద్రాలు అనుబంధ గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు వెనుకబడిన ప్రాంతాలకు పలు రకాల వైద్య సేవలు చేయడం యలమంచి ఉదయ్ కిరణ్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు ప్రజల హృదయాలను తాకుతూ, మియాపూర్ నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మద్దతును పొందుతున్నాయి.రాజకీయ రంగంలో కూడా అందరూ మన్ననలు పొందుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.ఇంతకముందు కూడా వీరి సేవలను గుర్తించి బెస్ట్ అచీవ్మెంట్ అవార్డును ప్రెస్ వింగ్స్ క్లబ్ నుండి అందుకున్నారు.గౌరవాలు ఆయనకు మరింత బాధ్యతను,సేవా సంకల్పాన్ని ఇచ్చాయని ఆయన తెలిపారు.

## ఆటో డ్రైవర్లకు కాఖీ చొక్కాలు పంపిణీ చేసిన సౌత్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్

**దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో..!**



విశాఖపట్నం : విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న ఆటో డ్రైవర్లకు కాఖీ చొక్కాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు నుండి సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్ మరియు వార్డ్ సీనియర్ నాయకులు గోలగాని రవిఈశ్వరరావు ఆధ్వర్యంలో 29వ వార్డు నుండి పలు ఆటో స్టాండ్ ల వారు వంశీకృష్ణ శ్రీనివాస్ కార్యాలయానికి తరలి వెళ్లి వంశీకృష్ణ శ్రీనివాస్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా మన్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ కూటమి పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 3,000 మంది ఆటో డ్రైవర్లకు కాఖీ చొక్కాలు పంపిణీ చేయటం చాలా ఆనందమైన విషయమని, నియోజకవర్గంలో అన్ని సమస్యల పైన అవగాహన కలిగిన నాయకుడిని మన శాసనసభ్యులుగా చేసుకోవడం మన అదృష్టమని, వంశీకృష్ణ శ్రీనివాస్ సారథ్యంలో దక్షిణ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. 29 వ వార్డు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ముందుగా ఇంతటి మంచి కార్యక్రమం తలపెట్టిన వంశీకృష్ణకి తమ ఆటో డ్రైవర్ కార్మిక సోదరులందరి తరఫున ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ,ఎన్డీఏ కూటమి పాలనలో ప్రజలందరూ చాలా ఆనందంగా ఉన్నారని,దక్షిణ నియోజకవర్గం లో వంశీకృష్ణ శ్రీనివాస్ అభివృద్ధి పథంలో తనదైన ముద్రను వేసుకుంటున్నారని,అంతేకాకుండా తమ ఆటో డ్రైవర్ కార్మిక సోదరులందరి మద్దతు వంశీకృష్ణ శ్రీనివాస్ కి ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి గిరిబాబు, 29వ ఆటో కార్మిక సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అవంతిలో ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్ ఫర్ 5జి పైన వర్క్ షాప్




తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం నందు బి.ఎస్.ఎన్.ఎల్ విశాఖపట్నం వారు సహకారంతో ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్ ఫర్ 5జి పైన వర్క్ షాప్ ను తేదీ: 26 జూన్ 2025 నుండి 02 జూలై 2025 వరకు నిర్వహిస్తున్నారు. రిసోర్స్ పర్సన్స్ డా. జి అనంతరావు గారు, డాక్టర్ పి. శంకరరావు గారు, శ్రీ వి. శివ భాస్కరరావు గారు, శ్రీమతి కె. శ్యామల గారు, శ్రీ ఎమ్. వినయ్ కుమార్ గారు వివరిస్తారు. నైపుణ్యాభివృద్ధిలో %దీూచీూ% ఇంక్యుబేషన్ సెంటర్ ఎలా కీలకపాత్రపోషించిందో వివరిస్తూ 5%+% సాంకేతికతకు ఫైబర్ ఆప్టిక్ కమ్యూనికేషన్ అలా ఉపయోగ పడుతుందో తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ, గారు, డైరెక్టర్ డా. ఏ. చంద్రశేఖర్ గారు పమాట్లాడుతూ కమ్యూనికేషన్‌లో ఇటీవలి జరిగిన నూతన సాంకేతిక అభివృద్ధి గురించి వివరించారు. ఈ వర్క షాప్ లో అధ్యాపకులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీఆర్ఏలను ఆదుకోండి...!!

**ఉప్పాడ చిన్నారావు**



ఆనందపురం : తరతరాలుగా రెవిన్యూ వ్యవస్థ లో తలయారీలు గాను గ్రామ నౌకర్లు గాను గ్రామ సహాయకులుగాను ప్రస్తుతం విఆర్ఎ లు గాను పాత్రలు పోషిస్తున్న దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వీఆర్ఏల సంఘం మండల కార్యదర్శి ఉప్పాడ చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందపురం మండలం పెద్దిపాలెం లో ఆయన మీడియాతో మాట్లాడారు. అనేక మంది చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నారన్నారు. అర్ధాకలి తో అలమటిస్తూ జీవనం సాగిస్తున్నారని వాపోయారు. గ్రామ ప్రజలు తోను అధికారులు తోను సమన్వయం ఏర్పరచుకుని ఎన్నో సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో జరిగిన ప్రతి పనికి రేయింబవళ్లు ఉపయోగించుకున్నటప్పటికి సరైన జీతభత్యాలు అందడం లేదన్నారు. విఆర్ఎ లకు టి ఏ, డి ఎ లు కల్పించకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. నైట్ డ్యూటీ లు మరియు అటెండర్లుగాను పని చేయించుకున్నప్పటికీ సరైన ప్రతిఫలం అందడం లేదన్నారు. పనిభారం ఎక్కువ జీతం తక్కువ గా ఉందన్నారు.ధరలు ఆకాశా నంటుతున్న నేపధ్యంలో కుటుంబ పోషణ జరగక పిల్లలు చదువులకోసం నాన్న యాతన పడుతున్నా మన్నారు. సరిపడని నిరాంతరం పనిచేసిన ఫలితం లేకుండా విఆర్ఎ చనిపోతే వేంటనే వారి కుటుంబ వారుసులకు ఉద్యోగం భద్రత కల్పించడం లేదని తెలిపారు. చనిపోయిన కుటుంబాలకు తక్షణం మే ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. . తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత మరియు ఫేస్కేలు అమలు చేయించి అధిక శాతం ఉన్న దళితులకు జీతాలపెంచి ఆదుకోవాలని ఉప్పాడ చిన్నారావు పేర్కొన్నారు.

## దివిస్ లేబరేటరీ లిమిటెడ్ కు అవార్డు ప్రధానం చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ




తగరపువలస : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్ శ్రీకాకుళంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశం %డ% అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ ,చిప్పాడ వారికి బ్లడ్ డొనేషన్ కి గాను శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు పి మహేంద్ర మల్లికార్జున్లు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా దివిస్ జనరల్ మేనేజర్ వై యస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్యం పిలుపుమేరకు సుమారు 15 సంవత్సరాలనుంచి దివిస్ సిబ్బంది 1,000 మందికి పైగా రక్తదాన శిబిరంలో పాల్గొని 1000యూనిట్స్ రక్తం బ్లడ్ బ్యాంక్ సంస్థల ద్వారా రక్తగ్రహీతలకు అందజేయడం జరుగుతుంది అని ఈ సేవలను గ్రహించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు ఈ అవార్డు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు

## మంత్రి కొలుసు పార్థసారథి

## నాణ్యతకు ప్రాధాన్యతనిస్తాం..!!



ఆనందపురం : రాష్ట్రంలోని పేదలందరికీ సకల సౌకర్యాలతో కూడిన పక్కా ఇళ్లు కట్టిస్తామని, ఎన్.టి.ఆర్. కాలనీల్లోని పెండింగ్ పనులను అతి త్వరలోనే పూర్తి చేసి ఇళ్లను అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్టణం జిల్లా ఆనందపురం మండలంలోని గిడిజాల, అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని పైడివాడ అగ్రహారం గృహ నిర్మాణ లేఅవుట్లను స్థానిక ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్ బాబులతో కలిసి ఆయన సందర్శించారు. నిర్మాణాల కోసం అందుబాటులో ఉంచిన ఇనుము, ఇసుక, ఇతర ముడిసరుకులను, నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆయా లేఅవుట్లలో ఉన్న తాజా పరిస్థితిని పరిశీలించి అక్కడి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లేవుట్ల పరిధిలో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రణాళిక లేకపోవటం వల్ల ఇబ్బందులు తలెత్తాయని, ఆ లోపాలను సరిదిద్ది నాణ్యమైన రీతిలో ఇళ్లను నిర్మించి పేదలందరికీ అందజేస్తామని మంత్రి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకొని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో చర్చకు వచ్చిందని, ఆ మేరకు ప్రస్తుతం అందిస్తున్న నగదుకు అదనం బీసీ, ఎస్సీలకు రూ.50,000, మైదాన ప్రాంత ఎస్టీలకు రూ.75వేలు, గిరిజన ప్రాంతాల్లో ఉండే ఎస్టీలకు రూ.1లక్ష అదనపు సాయం అందిస్తామని చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో ఉండే వారికి 3 సెంట్లు, పట్టణ ప్రాంతం వారికి 2 సెంట్లు స్థలం ఇస్తామని పేర్కొన్నారు. ఎన్.టి.ఆర్. కాలనీలకు సమీపంలో దుకాణ సముదాయాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, పేద ప్రజల ఆర్థిక శక్తి పెరిగేలా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. జలజీవన్ మిషన్, అమృత్ పథకాలను సరిగా గత పాలకులు వినియోగించుకోలేకపోయారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ వల్ల ఆ పథకాలను గడువును కేంద్రం పెంచిందని గుర్తు చేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవటం ద్వారా ప్రతి ఎన్.టి.ఆర్. కాలనీకి అతి త్వరలోనే తాగునీటి సదుపాయం కల్పిస్తామని, రెండు మూడు నెలల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. నాణ్యమైన వస్తువులను, ముడి సరకులను వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశామని చెప్పారు. వీలైనంత త్వరలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని తాత్కాలికంగా జీవీఎంసీ, వీఎంఆర్డీఏ నుంచి సహకారం తీసుకొని విద్యుత్, తాగునీటి వసతి కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. 2014-19 కాలంలో చంద్రబాబు నాయుడు హయాంలో పేదల ఇళ్ల నిర్మాణాలకు అంకురార్పణ పలికామని, రూ.2.50 లక్షలు అందించామని ఎస్సీ, బీసీ వర్గాలకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతామని గిడిజాలలో 45.76 ఎకరాల్లో 2,098 ప్లాట్లు వేశామని, 1869 మంది లబ్ధిదారులకు మంజూరు చేశామని పైడివాడ అగ్రహారంలో 320.83 ఎకరాల్లో వేసిన లేఅవుట్ లో 10,228 ప్లాట్లు ఉన్నాయని, 8925 మందికి ఇళ్లు మంజూరు చేశామని రాజకీయ పరమైన విభేదాలకు తావు లేకుండా గృహనిర్మాణ పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తామని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు. గృహ నిర్మాణ లేఅవుట్లలో, ఇళ్ల నిర్మాణాల విషయంలో జరిగిన అవకతవకలపై లోతైన విచారణ చేయిస్తామని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. అనర్హులు ఉంటే వారిని కూడా తొలగిస్తామని, అర్హులైన వారికి తిరిగి మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఆయా లేఅవుట్లలో ఇంకా ప్లాట్లు మిగిలి ఉన్నాయని ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకురాగా.. అర్హత ఉండి ఇల్లు రానివారు ఉంటే వారికి ఇవ్వాలని అధికారులకు సూచించారు. గిడిజాల, పైడివాడ అగ్రహారంలో అక్కడి స్థానికులు మంత్రితో మాట్లాడుతూ ఇక్కడ విశాఖ నగరానికి చెందిన వారికే ఇళ్లు మంజూరు చేశారని, స్థానికులమైన మాకు ఇవ్వలేదని చెప్పగా మంత్రి సానుకూలంగా స్పందించారు. పీఎంఏవైలో భాగంగా ఇళ్లు రానివారిని గుర్తించి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. చేసే పనిలో చిత్తశుద్ధి గతంలో లోపించిందని.. ఇప్పుడు అలాంటి పరిస్థితి రాదని పేర్కొన్నారు. 67.50 కోట్ల మందికి తల్లికి వందనం ఇస్తున్నామని, పెన్షన్ ఒకేసారి వెయ్యి పెంచామని, రూ.మూడు నుంచి నాలుగు వేలకు పెంచి 65 లక్షల మందికి ఇస్తున్నామని మంత్రి పార్థసారథి వెల్లడించారు. పేదల సంక్షేమం, యువత ఉద్యోగాల కోసం ముఖ్యమంత్రి తపన పడుతున్నారని, ఆయన వల్ల రాష్ట్రానికి విరివిగా పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. అయితే కొంతమంది గిట్టని వారు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ప్రతిపక్షంపై మంత్రి పరోక్షంగా విమర్శలు సంధించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు మాట్లాడుతూ త్వరితగతిన మౌలిక వసతులు కల్పించాలని, అదనపు ఆర్థిక సాయం మంజూరు చేసి పండగ వాతావరణంలో ఇళ్లను ప్రారంభించేందుకు సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మిగిలిన సైట్లను స్థానిక ప్రజలకు కేటాయించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. రెండు చోట్లా మంత్రి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణ లేఅవుట్ల సందర్శనలో మంత్రితో పాటు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏపీ గ్రోవర్స్, ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, ఇతర ప్రజా ప్రతినిధులు, హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు, డీఈలు, ఈఈలు, సమాచార పౌర సంబంధాల శాఖ జేడీ వి. మణిరామ్, డీడీ కె. సదారావు, ఇతర అధికారులు ఉన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం పీ.వీ.నరసింహారావు స్మారకార్థం అవార్డును ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కు విజ్ఞప్తి

**తెలుగు భాష లీవి.. మన పీవీ నరసింహారావు**

**పీవీ 104వ జయంతి సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**



విశాఖపట్నం : తెలుగు భాష లీవి.. మన పీవీ నరసింహారావు అని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కీర్తించారు. శనివారం ఉదయం పీ.వీ.నరసింహారావు 104వ జయంతి సందర్భంగా సిరిపురంలోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ ఎదురుగా ఉన్న పీ.వీ.నరసింహారావు విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం బి.వి.రామ్ మీడియాతో మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఆ మాటకొస్తే దక్షిణ భారతదేశం నుంచి ప్రధానమంత్రి పీఠాన్ని అధీష్టించిన మొట్టమొదటి వ్యక్తి దివంగత పీ.వీ. నరసింహారావు అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసినప్పటికీ ఆ పార్టీ పీ.వీ.నరసింహారావును గుర్తించలేక పోయిందన్నారు. అయినప్పటికీ భారతీయ జనతా పార్టీ పీ.వీ.నరసింహారావు సామర్థ్యాన్ని గుర్తించి భారతరత్నతో గౌరవించిందన్నారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా పీ.వీ. నరసింహారావు స్మారకార్థం ఒక అవార్డును ప్రకటించాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కు రామ్ విజ్ఞప్తి చేశారు. పీ.వీ.నరసింహారావు 1991లో భారతదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించే సమయానికి దేశ ఆర్థిక పరిస్థితులు ఎంత మాత్రం బాగోలేవన్నారు. ఈ పరిస్థితులలో మన్మోహన్ సింగ్ తో కలిసి పీ.వీ.నరసింహారావు అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు ఇప్పటికీ దేశ ఆర్థిక పునాదులు శక్తివంతంగా నిలిచి ఉన్నాయన్నారు. తెలుగు వారు ప్రతి ఒక్కరు పీ.వీ.నరసింహారావు ప్రతిభా పాటవాల పట్ల గర్వ పడుతున్నారని కీర్తించారు.

## ఆర్టీసీ టూర్ ప్యాకేజీకి విశేష స్పందన

తెలంగాణ బ్యూరో ప్రజాస్వామ్యం తెలంగాణ




చెంగిచెర్ల: దేవాలయాల దర్శనాలకు ఆర్టీసీ ప్రవేశ పెట్టిన టూర్ ప్యాకేజీకి విశేష స్పందన లభించినట్లు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. దేవాలయాల దర్శనాలకు ఆర్టీసీ ప్రవేశ పెట్టిన ప్యాకేజీలో భాగంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి లోని పలు కాలనీల నుండి 3 బస్సు లలో ప్రయాణికులతో కలిసి ఆమే దైవ దర్శనాలకు వెళ్లారు. ఈ సందర్బంగా ఆమే మాట్లాడుతూ ఈనెల 27 నుండి చెంగిచెర్ల నుంచి ఉప్పల్ మీదుగా ముచ్చింతల్ లోని అనంతపద్మనాభ స్వామి ఆలయం, కొత్తూరు మీదుగా షాద్ నగర్ లోని రామలింగేశ్వరస్వామి దేవాలయం, అమ్మపల్లి లోని సీతారామస్వామి ఆలయం, వెండికొండ లోని వెండికొండ సిద్ధేశ్వరస్వామి దేవాలయాల సందర్శనానికి ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. 30 నుంచి 40 మంది ప్రయాణికులు ఉంటే.. వారి కాలనీ వద్ద నుంచే బస్సు బయలు దేరుతుందని చెప్పారు. పెద్దలకు రూ.600, పిల్లలకు రూ. 300 ఛార్జీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ అందిస్తున్న దేవాలయాల దర్శనాల టూర్ ప్యాకేజినీ భక్తులు వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ చెంగిచెర్ల సెల్ నెంబర్ 78930 88433 సంప్రదించాలన్నారు..

## పార్టీని అభివృద్ధి పదములో నడిపించడమే నా కర్తవ్యము.

**నూతనముగా ఎన్నుకోబడినగుమ్మ లక్ష్మీపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్.**



జియ్యమ్మవలస/గుమ్మలక్ష్మపురం/ : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గంగుమ్మలక్ష్మపురం మండలం తెలుగుదేశం పార్టీ సమావేశం అధ్యక్షతన పాడి సుదర్శన్ రావు ఆధ్వర్యంలో సమస్త గత ఎన్నికల సమావేశంనిర్వహించడం జరిగిందనిపాడి సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కురుపాం నియోజకవర్గం పరిశీలకులు మాజీ శాసనసభ్యులు బుడ చైర్మన్ తెంటు లక్ష్మనాయుడు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కురుపాం నియోజకవర్గ శాసనసత్యరాలు తోయక జగదీశ్వరి. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామినాయుడు సమక్షంలో గుమ్మలక్ష్మపురం మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యువ నాయకులు అడ్డాకుల నరేష్ నుమండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా బలపరచడం జరిగిందని కురుపాంశాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి తెలిపారు.తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్ మాట్లాడుతూ జాతీయ తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు, ఆదేశాల మేరకు కురుపాం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సమక్షంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధిష్టానికి అలాగే కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల నాయకులకు కార్యకర్తలకు రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వము అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కద్రక కళావతి. మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పద్మావతి. మందంగి భూషణం. తదితరులు పాల్గొన్నారు.

## యునైటెడ్ క్రైస్ట్ చర్చ్ లీగల్ అడ్వైజర్ గా బి.ఎస్. కృష్ణ (ఆల్ఫా కృష్ణ)

**ప్రముఖ వ్యాపారవేత్త ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చైర్మన్**

**నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి**

**కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ నేషనల్ స్పోక్స్ పర్సన్**


**విశాఖ జిల్లా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్**




విశాఖపట్నం : రాష్ట్రంలోనే అత్యున్నతమైన ప్రజాదరణ కలిగిన యునైటెడ్ క్రైస్ట్ చర్చి సంఘానికి లీగల్ అడ్వైజర్ గా బాధ్యతలు చేపట్టిన బిఎస్ కృష్ణ ఆల్ఫా కృష్ణ) ఆల్ఫా కృష్ణ మాట్లాడుతూ యునైటెడ్ క్రైస్ట్ చర్చి సంఘాలకు లీగల్ అడ్వైజర్ గా బాధ్యతలు స్వీకరిస్తూ ఈ పదవిని ప్రభువు యేసు క్రీస్తుకు అంకితం చేస్తూ,దేవుడిచ్చిన అవకాశం గా భావిస్తూ," అవధుల్లేని త్యాగధనుడు ఏసుక్రీస్తు తనను శిలువ వేసి, తన దేహానికి శీలలు కొడుతున్న వారిని కూడా క్షమించాలని భగవంతుని వేడుకున్న మహోన్నత క్షమాగుణ సంపన్నుడు యేసు క్రీస్తు అని ఆల్ఫా కృష్ణ పేర్కొన్నారు. యునైటెడ్ క్రైస్ట్ చర్చి సంగం ఈ అవకాశాన్ని ఇచ్చిన పెద్దలకు నా హృదయపూర్వక నమస్కారాలు చెప్తూ తమకు ఇచ్చిన బాధ్యతను కరాకంటిగా నూటికి నూరుపాళ్ళ న్యాయం చేస్తానని ఎటువంటి పక్షపాత విభేదాలకు తావు లేకుండా నా కర్తవ్యాన్ని నిర్వహిస్తానని ఏసుప్రభు మీద ప్రమాణకం చేస్తూ బాధ్యతలు స్వీకరిస్తున్నానని ఆల్ఫా కృష్ణ పేర్కొన్నారు. యునైటెడ్ చర్చ్ సంఘ సభ్యులకు అడ్వైజర్ బోర్డు కమిటీ కి డీకంబోర్డు కమిటీ సభ్యులకి మహిళా కమిటీ సభ్యులకు యూత్ కమిటీలో ఉన్న సభ్యులందరికీ మరియు యునైటెడ్ క్రైస్ చర్చ్ లో ఉన్న ప్రతి ఒక్క సభ్యుడికి ఆయన హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## డి ఎ జుగా అవగాహన కార్యక్రమాలువిజయవంతం.

ఎంపీడీవో కే ధర్మారావు.



జియ్యమ్మవలస : జియ్యమ్మవలసమండలం గిరిజన నాలుగు గ్రామపంచాయతీలో డి ఎ జుగా గ్రామసభలు చాలా విజయవంతంగా నిర్వహించి పూర్తి చేయడం జరిగిందని. ఆయన అన్నారు గ్రామసభలు చాలా బాగా నిర్వహించినందుకు, సహకారం అందించినందుకు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులకు, గ్రామస్థాయి ఉద్యోగులకు, సిబ్బందికి అందరికి పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే గ్రామ సభలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు మీ స్థాయిలో అక్కడికక్కడే కొన్ని పరిష్కారం చేయడం జరిగింది. మిగిలినవి రిజిస్టర్లో నమోదు చేయడం జరిగింది అర్జీలు ఎవరి శాఖకు సంబంధించి వారు తీసుకొని పరిష్కారం చేసి,గిరిజనులకు పూర్తిస్థాయి న్యాయం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## రైతు రాజయ్యేదెన్నడు..?

రైతు లేనిదే రాజ్యం లేదు. అన్నదాతలే దేశానికి వెన్నెముక. జై కిసాన్ అంటూ జేజేలు పలుకుతూ పల్లకి మోతలే మోస్తూ "మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు తంగేళ్లు దాటడం లేదు" అన్నట్లుగా ఉంది. నిజానికి రైతు శ్రమకు తగ్గ గుర్తింపు, గౌరవం ఇస్తున్నామా? అంటే లేదని చెప్పాల్సి వస్తుంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూనే ఉంది. కానీ పారిశ్రామిక, సాంకేతిక, సేవారంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపు (జీఏవి)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా తగ్గుతోంది.

వికసిత భారత్ ఆవిష్కరణ ఎలా?

కృత్రిమ మేధ (ఏఐ) అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే!. వ్యవసాయ రంగం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా కునారిల్లుతుంది. రైతు ఆత్మహత్యలను ఆపలేకపోవడం పాలకుల లోపమా? రైతుల శాపమా? ఏది ఏమైనా బలిపీఠంపై ఉన్న సాగును బాగుపడేలా చేస్తూ, రైతును రాజును చేసే సంగతేమో కాని కనీసం ఆత్మహత్యలను నివారించాల్సి ఉందనేది కాదనలేని నిజం. అప్పుడే నేటితరం యువత ఆ రంగంలోకి రాగలరు.. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కల్పించడం అభినందనీయమే..

### - ఇరాన్‌పై.. పంతం నెగ్గించుకున్న అమెరికా!

### రైతు కాడి వదిలేస్తే..

ఈ సంవత్సరం వర్షాలు జోరుగా కురుస్తాయని, రుతు పవనాలు ముందే వస్తాయని వాతావరణ శాఖ చెప్పింది. చెప్పినట్లుగానే జూన్ మొదట్లో రుతుపవనాలు వచ్చి తొలకరి కురిసి మురిపించింది. ఆ తర్వాత జూన్ నెల చివరకు వస్తున్నా ఆకాశం మేఘావృతమై ఉంటుందే.. కానీ వర్షాలు పడడం లేదు. తొలకరి వానలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతులు నొసటిన చేయి పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితులు ఇన్నేళ్లైనా మారనే లేదు.. వ్యవసాయం అంటే పండినా.. పండక పోయినా రైతు నిరాశ చెందకుండా ముందుకే సాగుతాడు.. ఈ పరిస్థితి ఈనాటిది కాదు.. తరతరాలుగా తాత ముత్తాతల నుంచి చూస్తున్నాం. మన దేశంలో సాగు రంగంలో దండుగ! పండుగ రెండూ ఉంటాయి. వ్యవసాయ రంగంలో ఒక ఏడు పండితే.. మరో ఏడు పండదు! అయినా పండలేదని రైతు కాడి-మేడి వదిలేస్తే.. అందరికీ ఆహారం ఎలా? ప్రకృతి విపత్తులకు తోడు పాలకుల ఉదాసీనత, వ్యాపా(దళా)రుల దోపిడీ, నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుమందులు, నాణ్యత లేని ఎరువులు.. ఇలా అనేక విధాలుగా అష్టకష్టాలైనా అను భవిస్తూ, అధిగమిస్తూ పంట పండిస్తాడు. చివరకు పండిన పంట అమ్ముకునే నాటికి గిట్టుబాటు (మద్దతు) ధర ఉండదు. అలా అని రైతు నిరాశకు, నిస్పృహకు లోనైతే మనం బతికేదెలా? అని రైతులు సాగు చేస్తూ వారు బతుకుతున్నారు. మనల్ని బతికిస్తున్నారు.

# జిల్లా జూనియర్, యూత్ రెడ్ క్రాస్ గ్రూప్ లలో విద్యార్థులు సభ్యత్వం తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యాలు కావాలి.

జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి



భీమవరం : శనివారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పశ్చిమగోదావరి జిల్లా జూనియర్, యూత్ రెడ్ క్రాస్ గ్రూపు నిర్వహించే సేవ కార్యక్రమాలు మరియు సభ్యత్వ నమోదు పై జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్ తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్, డెంటల్ మరియు అన్ని విద్యాసంస్థలలో జూనియర్, యూత్ రెడ్ క్రాస్ గ్రూపులు ఏర్పాటు చేసి విద్యార్థిని, విద్యార్థులు అందరినీ సభ్యులుగా చేర్చి వారందరినీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేయాలన్నారు. తద్వారా వారిలో సామాజిక స్పృహ కలిగి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటారన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తహసిల్దారులు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. సత్వరమే సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తిచేసి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సన్నద్ధత చేయాలన్నారు. జూనియర్,యూత్ రెడ్ క్రాస్ చేపట్టే సహాయ కార్యక్రమాల ద్వారా పశ్చిమగోదావరి జిల్లా, రాష్ట్రంలో ప్రథమంగా ఉండే విధంగా సంబంధిత అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శివరామ బద్రిరాజు మాట్లాడుతూ రెడ్ క్రాస్ చేపట్టే కార్యక్రమాలను మండల విద్యాశాఖ అధికారులకు వివరించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఫస్ట్ ఎయిడ్, సి పి ఆర్, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టే సహాయ కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం చేపడతామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శివరామ భద్రిరాజు, జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులు, కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపల్స్, హెడ్మాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సముద్రపు నాచు పెంపకంపై మత్స్యకార మహిళా సంఘాలకు అవగాహన కల్పించండి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



భీమవరం: జిల్లాలో మత్స్య శాఖ సంబంధించి 1100, కాల్ సెంటర్, పి జి ఆర్ ఎస్ లో పిటిషనర్లు పెట్టుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని మత్స్యశాఖ అధికారులును ఆదేశించారు. కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారి మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎఫ్డిఓ లు తో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మత్స్య శాఖకు సంబంధించిన 1100, పీ జీ ఆర్ఎస్ లో పిటీషనర్ల నుండి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి జాప్యము లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఎఫ్ డి ఓ లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పిటీషనర్ తో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకోవాలని సమస్య జటిలమైనదైతే ఎందుకు పరిష్కారం కావడం లేదు పిటీషనర్ కు వివరించాలి అన్నారు. సీ వీడ్ (సముద్రపు నాచు) పెంపకం కోసం నరసాపురం, మొగల్తూరు మత్స్యకార మహిళ సంఘాల వారికి శిక్షణ ఇచ్చి సివిడ్ పై అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మత్స్యశాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్ వి ఎస్ ప్రసాదరావు, భీమవరం, నరసాపురం మత్స్య శాఖ సహాయ సంచాలకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎల్ ఎన్ రాజు, ఎఫ్ డి వో లు తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ ఎంపీల్లో ప్రశ్నించే మగాడే లేడు

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు.

పోలవరం ఎత్తు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారు

పీసీపీ చీఫ్ షర్మిల ఘాటు విమర్శలు



నిడదవోలు :పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. ఏలూరులో మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఎత్తును 45 నుంచి 41 మీటర్లకు తగ్గిస్తుంటే టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ ఎంపీల్లో ప్రశ్నించే ఒక్క మగాడు కూడా లేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. బనకచర్లపై రాష్ట్ర ప్రయోజనాలే తమ స్టాండ్ అని, అన్ని పార్టీలతో కలసి నీటి హక్కుల కోసం పోరాడతామని చెప్పారు. కాంగ్రెస్ ఒక మహాసముద్రం, పిల్ల కాలువలన్ని సముద్రంలోకి చేరాల్సిందేనని, వైసీపీకి కూడా ఇది వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత షర్మిల రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల సపోర్టుతోనే కేంద్రంలో మోదీ ధీమాగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇంకా బలపడకపోతే, రాహుల్ ప్రధాని కాకపోతే ఒక్క విభజన హామీ నెరవేరదన్నారు. సీతంపేటల రాజీవ్‌గాంధీ పార్కులో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని షర్మిల ఆవిష్కరించారు.

# రైతన్నలకి పండగలాంటి వార్త.. అన్నదాత సుఖీభవ పతాకంపై బిగ్ అప్‌డేట్.. ఖాతాల్లోకి నగదు ..!




తాడేపల్లిగూడెం :ంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్‌లో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమైంది. ఈ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20,000 ఆర్థిక సహాయం అందించనుంది, ఇందులో కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ యోజన నిధులు (రూ.6,000) కలిపి, రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 అదనంగా అందజేస్తుంది. ఈ మొత్తాన్ని మూడు విడతలలో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. మరో వారం రోజుల్లో పీఎం కిసాన్ 20వ విడత నిధులతో పాటు అన్నదాత సుఖీభవ నిధులను కూడా జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. రైతులు తమ ఆధార్‌తో బ్యాంక్ ఖాతా లింక్ అయిందని, ఈ-కేవైసీ పూర్తయిందని వెబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## అర్హత మరియు నిబంధనలు

అన్నదాత సుఖీభవ పథకం ప్రయోజనాలు చిన్న, సన్నకారు రైతులు మరియు కౌలు రైతులకు మాత్రమే అందుతాయి. ఆర్థికంగా స్థిరంగా ఉన్నవారు, రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్నవారు (మాజీ, ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, మేయర్లు, జడ్పీ చైర్‌పర్సన్లు), కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, రూ.10,000 లేదా అంతకంటే ఎక్కువ పెన్షన్ పొందేవారు ఈ పథకానికి అనర్హులు. అర్హత కలిగిన రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. అర్హత స్థితిని తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లో ఆధార్ నంబర్‌తో స్టేటస్ చెక్ చేయవచ్చు. ఈ పథకం రైతుల ఆర్థిక భారాన్ని తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచే లక్ష్యంతో అమలు చేయబడుతోంది.

# వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో డిఆర్ఓ సమీక్ష......





భీమవరం : వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులతో సమీక్షించిన డి ఆర్ ఓ మొగిలి వెంకటేశ్వర్లు........ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు అనుసరించి 2025 ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి చదలవాడ నాగరాణి ఆదేశాలు అనుసరించి శనివారం జిల్లా కలెక్టరేట్ డిఆర్ఓ ఛాంబర్ లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో వాటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్లను నమోదు చేయటం, ఓటర్ జాబితాలో సవరణ చేయడం వంటివి చేపట్టటం జరుగుతుందని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. కొత్త ఓటర్లు నమోదు, ఓటర్ల జాబితాలో సవరణలు మార్పులు చేయుట, చనిపోయిన వారి పేర్లను శాశ్వతముగా తొలగించుట, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను తొలగింపు, చిరునామా మార్పు తప్పులను సరిదిద్దడం వంటివి తమ దృష్టికి తీసుకురావాలని వివరించారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్ లో మౌలిక సదుపాయాలు, ఎలక్ట్రోరల రోల్స్ ప్యూరిఫికేషన్ విషయంలో అన్ని రాజకీయ పార్టీల సహకారం అందించాలని, ఎలక్షన్ సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న తెలపాలని కోరారు. ఈ సంవత్సర కాలంలో ఫారం-6 లో కొత్తగా దరఖాస్తు చేసుకున్న ఓటర్లు 6,873 గాను 478 దరఖాస్తులు రిజెక్ట్ చేయగా 6,187 ఆమోదించడం జరిగిందని, 208 పెండింగ్ లో ఉన్నవని అన్నారు. ఫారం 6 -ఏ లో ఎన్ ఆర్ ఐ లు ఇద్దరు దరఖాస్తు చేసుకోగా రెండు ఆమోదించడం జరిగిందన్నారు. ఓటర్లు లిస్టు నుండి తొలగింపు ఫారం 7 లో 1,191 దరఖాస్తులకు 909 రిజెక్ట్ చేయగా 10,108 ఆమోదించగా 174 పెండింగ్ ఉన్నాయని అన్నారు. ఓటర్లు మార్పులు చేర్పులకు సంబంధించి ఫారం-8లో 15,735 దరఖాస్తులుగాను 518 రిజెక్ట్ చేయగా 14,788 ఆమోదించగా 430 పెండింగ్ ఉన్నాయన్నారు. జిల్లాలో 18 -19 సంవత్సరములు మధ్య వయసుగల ఓటర్లు 19,974 మంది 20-29 సంవత్సరములు వయసుగల వారు 2,51,672 మంది 30-39 మధ్య వయసు గలవారు 3,70,354 మంది 40 - 49 మధ్య వయసుగల వారు 3,3,902 మంది 50-59 మధ్య వయసు గలవారు 2,47,260 మంది 60-69 మధ్య వయసుగల వారు 1,54,548 మంది 70-79 మధ్య వయసు గలవారు 70,769 మంది 80ం వయసు ఉన్నవారు 24659 మంది ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 7,20,684 మంది, స్త్రీలు 7,50,377 మంది, థర్డ్ జెండర్స్ 77 మంది మొత్తం జిల్లాలో ఓటర్లు 14,71,138 గా ఉన్నారని డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు వివరించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎలక్షన్ సూపర్డెంట్ మర్రావు సన్యాసిరావు, ఐ ఎన్ సి ప్రతినిధి టి.వంశి శ్రీనివాసరెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధి బి.జయశివ, బి ఎస్ పి పార్టీ ప్రతినిధి ఎం.రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం ఏ ఆర్ కె ఆర్ మున్సిపల్ హై స్కూల్ ఆకస్మిక తనిఖీ.....






భీమవరం : మధ్యాహ్న భోజన పథకం మెనూ వివరాలపై ఆరా విద్యార్థులు వినియోగించే టాయిలెట్ పరిశీలన ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరుపట్టిని పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి భీమవరం పట్టణం నాలుగువ వార్డులో ఉన్న అల్లూరి రామకృష్ణ రాజు మున్సిపల్ హై స్కూల్ (ఏ ఆర్ కె ఆర్) శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు వండి పెట్టే కిచెన్ రూమ్ ను, పరిసరాలను పరిశీలించారు. రాగి జావా తయారు ఎలా చేస్తున్నారు, ఈరోజు మెనూ ఏమిటి మెనూ ప్రకారం అన్ని కరెక్ట్ గా చేస్తున్నారా రైసు సరైన పరిమాణంలో కొలిచి వేస్తున్నారా వెయిటింగ్ మిషన్లు, ఉపయోగిస్తున్నారా అని పలు ఆరాలు తీశారు. పిల్లలకు పెట్టే ఆహారంలో ఎటువంటి అవకతవకులు జరిగిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కిచెన్ రూమ్ ఎప్పుడు పరిశుభ్రంగా ఉండాలని, కీటకాలు ఏమీ రాకుండా కిటికీలకు మెస్ వేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడపడితే అక్కడ కోడిగుడ్లు అట్టలు, అట్టపెట్టెలు, చెత్త పారవేయకుండా ఒకచోట ఉంచాలని స్కూలు ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. టాయిలెట్ రూములను పరిశీలించి వాటిలో పైపులు పగిలి ఉండటం నీళ్లు సరిగా రాకపోవడం గమనించి వెంటనే రిపేరు చేయించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు పట్టిని పరిశీలించారు. 6 మంది ఉపాధ్యాయులు రాకపోవడం గమనించి ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులను వివరణ అడుగుగా సెలవు పెట్టారని అన్నారు. ఆరుగురు ఒకేసారి సెలవుకు కారణాలు తెలపాలని అన్నారు. విద్యార్థులు కూడా ఎక్కువగా ఆఫ్ సెంట్ ఉండటానికి కారణాలను చెప్పాలని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు క్లాస్ రూమ్ కి వెళ్లి పిల్లలతో మాట్లాడారు ఎలా చదువుతున్నారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెప్పు చున్నారా అని ఆరా తీశారు. కొద్దిసేపు పిల్లలతో ముచ్చటించారు. కిరణజన్య సంయోగా క్రియ సైన్స్ పాటమును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, విద్యార్థులకు స్వయంగా బోధించారు. విద్యార్థులు ఇష్టముగా చదువుకొని మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రు కు మంచి పేరు తేవాలని సూచించారు. స్కూలు ఆవరణ అంతా క్లీన్ గ్రీన్ గా ఉండాలని ఎక్కడ ఎటువంటి చెత్త లేకుండా ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్ది, ఫోటోలు తీసి రిపోర్ట్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంలో డిప్యూటీ డీఈవో ఎం.రమేష్, ఎంఈఓ-1 ఎన్.శ్రీనివాసరావు, ఎంఈఓ -2 వేంద్ర వెంకటేశ్వరరావు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రాము, తహసిల్దార్ రావి రాంబాబు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

# సీఎం సూచనలతోనే ముందుకు: మంత్రి దుర్గేష్



నిడదవోలు :రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధిని 20 శాతానికి తీసుకెళ్లి.. సీఎం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను నెరవేరుస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడలో జీఎఫ్ఎస్‌టీ టూరిజం కాంక్లేవ్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగం పూర్తి నిరాదరణకు గురైందని విమర్శించారు. గత ప్రభుత్వ విషాద ఛాయలు మళ్లీ పునరావృతం కాకుండా చేస్తామని తెలిపారు. ఈ రంగంలో ఆకాశమే హద్దు - అవకాశాలు వదలొద్దు అన్న సీఎం సూచనలతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ రంగం ద్వారా యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు అవకాశం ఉన్న రంగమన్నారు. 974 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం పర్యాటకాభివృద్ధికి అద్భుత అవకాశమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. 2029కి 25 మిలియన్ ఉద్యోగాలు సృష్టించాలని... 2.42 లక్షల కోట్లు పర్యాటకం ద్వారా దేశానికి వస్తోందని కేంద్ర పర్యాటకశాఖ కార్యదర్శి సుమన్ బిల్లా తెలిపారు. పర్యాటక రంగంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 75 కొత్త విమానాశ్రయాలు దేశంలో నిర్మితం అయ్యాయని.. ఇండిగో, టాటాల సంస్థలే 1000కి పైగా విమానాలు నడుపుతున్నాయని చెప్పారు. మనం ఇంకా 5 శాతంగానే పర్యాటకం ఉండడానికి కారణాలు ఏమిటన్నది విశ్లేషించుకోవాలని అన్నారు. దేశంలో 250 కోట్ల మంది ప్రయాణాలు చేస్తున్నారని.. అందులో 47 కోట్ల మంది హోటళ్లు, షాపింగ్ కోసం పర్యాటకానికి వస్తున్నారని చెప్పారు. ఈ సంఖ్య పెద్దదే అయినా ఇంకా పెంచుకోవాల్సి ఉందన్నారు. 2.7 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వెళ్తుంటే 1.9 కోట్ల మంది విదేశాల నుంచి వస్తున్నారన్నారు. ఇంత మంది భారతీయులను దేశంలోని పర్యాటక ప్రాంతాలకు మళ్లిస్తే సంపద పెరిగినట్టే అని పేర్కొన్నారు. ఇంత మంది పర్యాటకులను ఆకట్టుకోవాలంటే బ్రాండెడ్, అన్ బ్రాండెడ్ హోటల్ గదులు పెరగాల్సి ఉందన్నారు. 2029 నాటికల్లా ఈ సామర్థ్యం మూడు రెట్లకు పెరగాల్సి ఉందని.. మరిన్ని పెట్టుబడులు పర్యాటక రంగంలో హోటల్ బిజినెస్‌లో పెరగాలన్నారు. 15 ప్రాంతాలు అభివృద్ధి చేయాలని జాతీయ స్థాయిలో ప్రణాళిక చేశామని.. తద్వారా మౌలిక సదుపాయాలు పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పర్యాటక ప్రాజెక్టు పెట్టాలంటే మన దేశంలో 56 లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటోందని.. ప్రతీ లైసెన్సుకు 60 రోజుల సమయం పడుతోందన్నారు. సింగపూర్‌లో కేవలం 25 లైసెన్సులు రెండు వారాలు మాత్రమే పడుతోందని... లైసెన్సుల జారీ వేగం పెరగాలని అభిప్రాయపడ్డారు. ఏపీ పర్యాటక పాలసీ పెట్టుబడులను ఆకర్షించేలా ఉందని... రాష్ట్రానికి చాలా ప్రకృతి వనరులు ఉన్నాయన్నారు. తిరుపతి లాంటి చోట్ల 10 వేలకు పైగా బ్రాండెడ్ హోటల్ రూములు అవసరం ఉంటే ప్రస్తుతం ఇవి వెయ్యిలోపే ఉన్నాయని అన్నారు. కనీసం 3 - 4 రోజుల పాటు పర్యాటక ప్రాంతాల్లో ఉండేలా ఏర్పాట్లు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి లాంటి ప్రాంతాలు ఏపీలో చాలా ఉన్నాయని.. బౌద్ధ క్షేత్రాలు, ఎకో టూరిజం, బీచ్‌లు ఉన్నాయని, కోనసీమ, అరకు, పాపికొండలు లాంటి ప్రాంతాలను చాలా అభివృద్ధి చేయాల్సి ఉందని సుమన్ బిల్లా పేర్కొన్నారు.

# సాగిపోండి... సాఫీగా

ప్రతిసారీ ఫాస్టాగ్ రీచార్జి చేసుకునే చింత ఉండదు.


ఏడాదికి రూ.3 వేలు చెల్లిస్తే చాలు

టోల్‌ప్లాజాల ద్వారా 200 సార్లు లేదా ఏడాది కాలానికి

ప్రతిసారీ రీచార్జి చేసుకునే బాధ ఉండదు

కార్లు, వేన్‌లు, జీపులకే పరిమితం

ఉమ్మడి జిల్లాలో వాహనదారులకు ఆర్థిక వెసులుబాటు







నిడదవోలు : ప్రతిసారీ ఫాస్టాగ్ రీచార్జి చేసుకునే చింత ఉండదు. ఏడాది కాలానికి ఒకేసారి రూ.3వేలు చెల్లిస్తే దేశంలో ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా వెళ్లే అవకాశాన్ని కల్పించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ విధానంతో వాహనదారుల ప్రయాణం ఇక సాఫీగా సాగిపోతుంది. అయితే దీన్ని కార్లు, వేన్‌లు, జీపులకే పరిమితం చేశారు. ఈమేరకు కేంద్ర ప్రభు త్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని-రాజమహేంద్రవరం మధ్యలోని కాకినాడ జిల్లా కృష్ణవరం, దివాన్‌చెరువు-సిద్ధాంతం మధ్యలోని డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా ఈతకోట వద్ద టోల్‌ప్లాజాలు ఉండగా, 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి-కాకినాడ బైపాస్ మధ్యలో గొల్లప్రోలు వద్ద, గురజనాపల్లి-పాశర్లపూడి మధ్య గల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవన్నీ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్నాయి. వీటితోపాటు ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద మరో టోల్‌ప్లాజా ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉంది. వీటి ద్వారా ప్రయాణాలు సాగించే అన్ని రకాల కార్లు, వేన్‌లు, ఫోర్‌వీల్ ఆటోలు, లారీలు, బస్సులు, ట్రాలీలు, ఇతర భారీ వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి అక్కడ అమల్లో ఉన్న టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా దాటే సమయంలో ఆటోమెటిక్‌గా వాహనానికి చెందిన ఫాస్టాగ్ ద్వారా ఈ రుసుము కట్ అవుతుంది. ఒకవేళ ఫాస్టాగ్ సొమ్ములు లేకున్నా, వాహనానికి అసలు ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుము కంటే 100శాతం అదనంగా చెల్లించాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇదే విధానం అమలవుతోంది. ఇకపై ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బం ది లేకుండా ఏడాది రుసుము చెల్లించే విధానాన్ని అమలుల్లోకి తెచ్చింది. జాతీయ రహదారి ఫీ చట్టం 2008 కింద దీనిని అమల్లోకి తీసుకువస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి వచ్చే నూతన విధానం ప్రకారం ఏడాది కాలానికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫా స్టాగ్ రీచార్జి ఏడాది కాలానికి అమలులో ఉంటుంది. ఈ రీచార్జి చేయించిన వాహనం దేశంలోని జాతీయ రహదారులపై ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200 సార్లు ప్రయాణించే వీలుంది. ఏడాది లేదా 200 సార్లు ఏది ముందైతే దానిని పరిగణలోకి తీసుకుంటారు. ఏడాది కాలానికి ఫాస్టాగ్ తీసుకుంటే ప్రతి ఏటా ఏప్రిల్ 1వ తేదీన రీచార్జి చేయించుకోవాల్సి ఉంటుంది. ఏడాది ఫాస్టాగ్ రూ.3వేల రీచార్జిని కార్లు, జీపులు, వేన్‌లకు పరిమితం చేశారు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం తిరిగే వాహనాలకే వీటిని వర్తింపజేశారు. వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు ఇది వినియోగించుకునే అవకాశం ఉండదు. ముందుగా కార్లు, జీపులు, వేన్‌లకు దీనిని అమలుచేయడం ద్వారా పరిశీలన జరిపి దశలవారీగా అన్ని వాహనాలకు వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏడాది లేదా 200సార్లు తిరిగేందుకు వీలుగా ఫా స్టాగ్ తీసుకోవడం వల్ల వాహనదారులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతుంది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా ద్వారా కారు, జీపు వేన్‌లకు ఒకవైపు రూ.50 రుసుముగా ఉంది. దీని ప్రకారం 200 సార్లు ఇవి తిరిగితే పాత పద్ధతిలో రూ.10వేలు అవుతుంది. అదే నూతన విధానంలో రూ.3వేలు చెల్లిస్తే సరిపోతుంది. అదే కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 200 ట్రిప్పులకు రూ. 22 వేలు, ఈతకోట వద్ద టోల్‌ప్లాజా వద్ద 25 వేలు వ్యయం అవుతుంది. రాష్ట్రంలోని ఇతర టోల్‌ప్లాజాల వద్ద ఇంతకంటే అధిక రుసుమలు వసూలు చేస్తున్నారు. దీనివల్ల సాధారణ పద్ధతుల్లో అయ్యే ఫాస్టాగ్ రుసుములో కేవలం 15 శాతం నుంచి 33 శాతం లోపుగా ఒకేసారి చెల్లిస్తే ఏడాదిపాటు లేదా 200 సార్లు ప్రయాణించే వీలుకలుగుతుంది. ఫాస్టాగ్ రీచార్జి విధానంపై ఆయా కేటగిరీల వాహనదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఈ టోల్‌ఫీ అన్ని రకాలుగా తమకు లాభదాయకమేనని చెబుతున్నారు.

# విధి నిర్వహణలో అమరులైన ఎస్ఐ, కానిస్టేబుల్ ఆత్మలకు శాంతి చేకూరాలి..



తాడేపల్లిగూడెం :విధి నిర్వహణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆలమూరు ఎస్సై ముద్దాల అశోక్, కానిస్టేబుల్ ఎస్ బ్లెసన్ జీవన్ ఆత్మలకు శాంతి చేకూరాలని ఆలమూరు ప్రెస్ క్లబ్ సభ్యులు ఐదు నిమిషాల పాటు మౌనం పాటించారు. మండల కేంద్రమైన ఆలమూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ అంటే ఏమిటో ప్రజలకు రుచి చూపించి, అసాంఘిక శక్తులకు సింహ స్వప్నమైన ఎస్సై ఇకలేరు అనే విషాదకరమైన వార్త దిర్భాంతికి గురిచేసిందన్నారు. మండలంలో శాంతిభద్రతలను కాపాడటంలో తనదైన శైలితో తన కర్తవ్యాన్ని నిర్వర్తించే వారిని, అసాంఘిక శక్తుల నుండి బాలికలు మహిళలు తమకు తాము ఎలా రక్షించుకోవాలో గ్రామాల ముఖ్య కూడళ్ళలోను, పాఠశాలలోను ఎన్నో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి ధైర్యం చెప్పేవారిని, నేర సమాచారాన్ని విలేకరులకు తెలపడంలో ముందుండేవారిని ఇటువంటి మహనీయులను కోల్పోవడం ఇటు మీడియాకు అటు ప్రజలకు తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

# ఇంతకూ ధర్మాసనం ఎందుకు





గవర్నర్లు బిల్లుల ఆమోదంపై కాలపరిమితిని పాటించకపోవడం రాజ్యాంగ సమస్యగా మారింది. రాష్ట్రపతి 14 కీలక ప్రశ్నలతో సుప్రీంకోర్టును సందర్శించడంతో, పాలనా జాప్యాలపై చర్చ మరింత తీవ్రతరమైంది. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, కేంద్ర రాష్ట్ర కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ళు, పరిపాలన సంబంధిత నిబంధనల నిర్వహణ... ఇవన్నీ ప్రజలకు తక్షణం పరిష్కారం కావాల్సిన అవసరాలు. ఇటీవల బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితిని సూచిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఇది కొత్త ఆలోచన కాదు. హెూంమంత్రిత్వ శాఖ మార్గదర్శకాల్లోనే ఉంది. హెూంమంత్రిత్వ శాఖే సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ విచారణలో బిల్లుల ఆమోదంపై గడువును నిర్ణయించాలని అన్నది. ?ఇప్పుడు మళ్లీ సుప్రీం తీర్పుపై వివరణ కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు. గడువు అవసరాన్ని ప్రభుత్వమే ఒప్పుకున్న తర్వాత మరలా ఆ గడువుకు సంబంధించిన తీర్పు మీదనే సుప్రీంకోర్టుకే 14 రెఫెరెన్సులు ఎందుకు? అందుకోసం సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇటూ అటూ లాయర్లు సుదీర్ఘ కాలం నడిపిస్తారు. చివరకు సుప్రీంకోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా, "మాకిష్టం లేదు. మేం ఒప్పుకోం," అనే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని రాజ్యాంగంలోనే మనం రాసుకున్నాం. అలాంటప్పుడు ఇదంతా వృథా కాదా? 2024 ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో: "మేము కేవలం హెూం మంత్రిత్వ శాఖ 2016లో జారీ చేసిన మెమొరండమ్ రూపంలోని మార్గదర్శకాలను అనుసరిస్తున్నాం, అవి మూడు నెలల గడువును సూచించాయి" అని పేర్కొంది. అంటే ఈ కాల పరిమితిని మొదట కేంద్ర ప్రభుత్వమే సూచించింది. అటువంటప్పుడు మళ్ళీ సుప్రీంకోర్టు విచారణ అవసరం ఎందుకు? భారత రాష్ట్రపతి దేశ పాలనలో రాజ్యాంగ అత్యున్నత పదవిలో ఉన్నారు. రాష్ట్రపతి ఎన్నిక కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓటింగ్ చేస్తారు. దేశవ్యాప్తంగా అత్యంత విశాలమైన ప్రజాతంత్ర ప్రాతినిధ్యం కలిగి ఉంటుంది. అందుకే ఆ పదవికి గౌరవం. గవర్నర్లను రాష్ట్రపతి ద్వారా ప్రధానమంత్రి, మంత్రివర్గ సిఫార్సు మేరకు నియమిస్తారు. ఇది ఎన్నిక కాదు. వారు చేసే ఎంపిక. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లకు అత్యున్నత పరిపాలనాధికారాలు ఉంటాయి. వాటిని దుర్వినియోగం చేయకూడదు. బాధ్యతాయుతంగా పనిచేయాలి. కానీ ఇది జరగటం లేదు. ఇది కేవలం తమిళనాడు సమస్యకాదు, ఎన్డీయేతర రాష్ట్రాలన్నిటిలోనూ ఈ సమస్య ఉంది. ఆర్టికల్ 200, 201లో కాల పరిమితులు లేకపోవటం తప్పుగా పరిగణించాల్సిన అవసరం లేదు. కానీ పరిపాలనలో సమయానుకూల నిర్ణయాలు కీలకం. గవర్నర్లు ఈ బాధ్యతను విస్మరించరాదు. తాము సంప్రదాయ పరిపాలనా అధికారం కలిగినప్పటికీ, నిర్ణయాలు ఆలస్యం చేయకూడదు. సుప్రీంకోర్టు తీర్పు అందరు గవర్నర్లకు వర్తిస్తుంది. గవర్నర్ ముఖ్యమంత్రుల మధ్య ప్రతి రాష్ట్రంలోనూ గొడవ ఉండదు. కేంద్రంలో రాష్ట్రాల్లో వేరే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఈ ఆలస్యాలు కావాలని చేస్తున్నట్టు కనపడుతూనే ఉంది. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసుకోలేక పరిపాలన స్తంభించిపోతున్నది. తమిళనాడు వెర్సస్ గవర్నర్ ఆఫ్ తమిళనాడు (2025) కేసులో గవర్నర్ 'పాకెట్ వీటో' వాడుతున్నారని తీవ్ర విమర్శలు వచ్చాయి. 'పాకెట్ వీటో' అంటే బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచటం. రాష్ట్రపతి వేసిన ఐదు కీలక ప్రశ్నలు ఇవే: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అధికారాలు న్యాయపరంగా పరిశీలించదగినవేనా? 2) ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్/ రాష్ట్రపతి పూర్తిగా న్యాయ సమీక్షకు అతీతమా? 3) రాజ్యాంగ కాలపరిమితి లేకపోతే గవర్నర్ బిల్లుపై నిర్ణయం తీసుకోవడం ఏ విధంగా జరగాలి? 4) ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి చేసే నిర్ణయాలు న్యాయపరంగా సమీక్షించదగినవేనా? 5) ఆర్టికల్ 201 ప్రకారం బిల్లులపై రాష్ట్రపతికి గడువు విధించవచ్చా? ఉందనుకుంటే సుప్రీంకోర్టు గడువులు ఇవ్వవచ్చా? రకరకాల అనుమానాలు: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కి నిర్ణయాల విచక్షణాధికారాలు ఉన్నాయా? గవర్నర్ రాష్ట్ర కేబినెట్ సలహా మేరకే పనిచేయాలా? అప్పుడు రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా తీసుకోవచ్చా? 2) ఆర్టికల్ 142 ప్రకారం కోర్టులు గవర్నర్/ రాష్ట్రపతిని తొలగించే ఆదేశాలు ఇవ్వగలవా? 3) గవర్నర్ అంగీకారం లేకుండా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం చట్టబద్ధమా? 4) ఈ అంశంపైన ఆర్టికల్ 145(3) ప్రకారం కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాల్సిన అవసరముందా? 5) ఆర్టికల్ 131 ప్రకారం ఒరిజినల్ సూట్ లేకుండా కేంద్రం రాష్ట్రాల మధ్య విభేదాలను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా? న్యాయమూర్తి పార్థివాలా అభిప్రాయం ప్రకారం గవర్నర్‌కు ఒక బిల్లు వచ్చాక... మూడు మార్గాలు మాత్రమే ఉంటాయి. ఒకసారి బిల్లు తిరిగి శాసనసభకి పంపి, అదే రూపంలో తిరిగి వస్తే రాష్ట్రపతికి పంపించే హక్కు గవర్నర్‌కు ఉండదు. ఆయన సూచనల మేరకే మార్పులు జరిగితే తప్ప. గవర్నర్ లేదా రాష్ట్రపతి బిల్లులపై జాప్యం చేస్తే ఆ ప్రభుత్వాలు కోర్టులో మాండమస్ రిట్ వేయవచ్చు. బిల్లుల ఆమోదంపై సుప్రీంకోర్టు తీర్పు దిశను సూచించినప్పటికీ, తుది స్పష్టత కోసం రాజ్యాంగ ధర్మాసనం అవసరమే. కానీ ఆర్టికల్ 143 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చే సలహాను ప్రభుత్వం పాటించాల్సిన అవసరం లేదు. ఈలోగా మంత్రిత్వ శాఖల ఆమోదానికి పంపిన బోలెడు బిల్లులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. ఇది ప్రజల పాలనపై హక్కును దారుణంగా ఉల్లంఘించటమే.

# ఆదిమ జాతుల అస్తిత్వ పెనుకేక




కెన్యాలో బ్రిటిష్ వలస పాలనకు, వలస పాలన అనంతరం పాలించిన స్వదేశీ పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, చింతనాపరుడు, సామాజిక శాస్త్రవేత్త, విప్లవ రచయిత గూగీ వా థియాంగో మే 28న అమెరికా లోని జార్జియాలో కన్ను మూసాడు. ఐరోపా కేంద్రీకృత చర్చల ఆధిపత్య... కెన్యాలో బ్రిటిష్ వలస పాలనకు, వలస పాలన అనంతరం పాలించిన స్వదేశీ పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, చింతనాపరుడు, సామాజిక శాస్త్రవేత్త, విప్లవ రచయిత గూగీ వా థియాంగో మే 28న అమెరికా లోని జార్జియాలో కన్ను మూసాడు. ఐరోపా కేంద్రీకృత చర్చల ఆధిపత్య ధోరణులను తమ రచనలతో, మేధా సంపత్తితో తుత్తునియలు చేసిన వారిలో ఎడ్వర్డ్ సయీద్, గూగీ వా థియాంగో ముందు వరసలో ఉంటారు. సయీద్ 1935లో పాలస్తీనాలో, గూగీ 1938లో కెన్యాలో పుట్టారు. విషాదం ఏమిటంటే, ఇద్దరూ పుట్టిన నేల మీద రక్షణ లేక, దశాబ్దాలపాటు ప్రవాసులు గానే బతికారు. 'ఓరియంటలిజం' రచనతో ఎడ్వర్డ్ సయీద్‌బీ 'డీకాలనైజింగ్ ద మైండ్', 'మూవింగ్ ద సెంటర్' రచనలతో గూగీ తమవైన మేధా తాత్విక మార్గాల్ని రహదారులుగా వేసారు. ఈ ఇద్దరి ప్రస్తావనా లేకుండా ఆధునిక సామాజిక శాస్త్రాలు అసంపూర్ణం. మూల వాసుల మౌఖిక గాథలను పారవశ్యంతో ప్రపంచ యవనిక మీద నిలబెట్టిన సాహసి గూగీ. తండ్రి థియాంగో 'గికుయు' తెగకు చెందిన ఒక విస్తాపితుడు, ఇద్దరు అన్నలు 1950ల్లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన మౌ మౌ సాయుధ పోరాటంలో అమరులు. గూగీ బాల్యం ఈ సాయుధ పోరాటం నేపథ్యంగా గడిస్తే, యవ్వనం స్వీయపాలన వచ్చాక కొనసాగిన నియంతల పాలన నేపథ్యంగా గడిచింది. ఆంగ్ల సాహిత్యం చదువుకుని నైరోబి విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా వృత్తి జీవితం మొదలుపెట్టాడు. అధ్యాపకుడిగా ఉన్న కాలంలోనే ఆయనపై రాజ్యం కన్నెర్ర చేసింది. దీనికి కారణం వలస పాలన అనంతరం కెన్యా పాలకుల దాష్టీకాలపై ఆయన చేసిన రచనలు. మొదట 'జేమ్స్ గూగీ' పేరుతో ఇంగ్లీషులో రచనలు చేసిన గూగీ తదనంతరం కాలంలో వలసవాద చిహ్నమైన 'జేమ్స్'ను తన పేరు నుండి తొలగించుకున్నాడు. ఇంగ్లీషును వదిలి మాతృభాషలైన 'గికుయు', 'స్వాహిలి' భాషలలో రాయటం మొదలుపెట్టాడు. ఈ నిర్ణయం తోనే ఆయన సాహిత్య రాజకీయ కార్యాచరణ మొదలైంది. ఆ క్రమంలో స్థానిక భాషలకు మౌఖిక సాహిత్యం ఎంత ముఖ్యమో బలంగా వాదించాడు. ఒక దశలో ఇంగ్లీష్ డిపార్టుమెంటులను రద్దు చేయాలి అనేదాకా పోయాడు. పంతొమ్మిది వందల యాభైలలో సాయుధ రాజకీయాల తర్వాత, కెన్యా వలస పాలన నుంచి విముక్తం అయ్యాక, డెబ్బయ్యవ దశకంలో తన సహచర నాయకులు పాలకులుగా మారడం మూలంగా, గూగీ బలవంతపు ప్రవాసిగా మారాల్సి వచ్చింది. మాతృదేశాన్ని వదిలిన తర్వాత దశాబ్దాలపాటు ప్రవాసి గానే బతికాడు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో తులనాత్మక సాహిత్యం %-% అనువాద విభాగానికి అధిపతిగా పనిచేశాడు. పూర్వీకులు వారసత్వంగా కాపాడుకున్న అపారమైన జానపథ కథలు, ఇతిహాసాలతోపాటు, కెన్యా సాయుధ పోరాటం భూమికగా పనిచేసిన గెరిల్లా వీరుల సాహస గాథలే గూగీ రచనల సారం. కెన్యా దేశంపై వలస పాలన తెచ్చిమోపిన ఆంగ్ల విద్య ఎలా స్థానిక భాషలను, సంస్కృతులను ధ్వంసం చేసిందో ఆయన ప్రతి రచన లోనూ చూడగలం. వలసవాద అణచివేతను ఆయనతోపాటు ఆయన సృష్టించిన పాత్రలూ ఎదుర్కోవటం ఒక విశేషం. 'మాటిగిరి' అనే నవలలో మాటిగిరి పాత్ర మీద పోలీసులు లుక్ అవుట్ నోటీసు కూడా ఇచ్చారు! ఆయన రచనల్లోని పాత్రలు కూడా పాలకులను వణికించాయంటే వాటి బలాన్ని, ప్రాసంగికతను అర్థం చేసుకోవచ్చు. 'వీప్ నాట్, చైల్డ్', 'ద రివర్ బిట్వీన్', 'అ గ్రైన్ ఆఫ్ వీట్', 'పెటల్స్ ఆఫ్ ద బ్లడ్', 'డెవిల్ ఆన్ ద క్రాస్', 'మాటిగిరి', 'విజార్డ్ ఆఫ్ క్రౌ' వంటి నవలలతో బాటు కథలు, నాటకాలు, 'డి కాలనైజింగ్ ద మైండ్', 'పెన్ పాయింట్స్ అండ్ గన్ పాయింట్స్', 'బారెల్ ఆఫ్ పెన్', 'మూవింగ్ ద సెంటర్' వంటి నాన్ ఫిక్షన్, జైలు డైరీ, యుద్ధకాలం నాటి జ్ఞాపకాలు... మొదలైనవి గూగీ ప్రసిద్ధ రచనలు. "చరిత్రలో భాష సంస్కృతులనేవి ప్రజల సామూహిక జ్ఞాపకాల నిధి" అంటాడు గూగీ. పూర్వీకులు వారసత్వ సంపదగా కాపాడుకుంటూ వచ్చిన ఆ నిధిని పాశ్చాత్య వలసవాదం, భాషా సామ్రాజ్యవాదం కబళిస్తున్నాయి అంటూ, ఆంగ్ల భాషా సాహిత్యాల స్థానే అంతరించిపోతున్న స్థానిక మూలవాసుల భాషలను అధ్యయనం చేయాలి అని బలంగా వాదించాడు. వలస వాదం తెచ్చిన క్రైస్తవ మతం, పాశ్చాత్య విద్య స్థానిక తెగల మధ్య ఎలాంటి అంతర్గత విభేదాలను, సాంస్కృతిక వైరుధ్యాలను పెంచి పోషిస్తున్నాయో, ఆ రెండు సమాజాల మధ్య పారుతున్న నది సజీవమైన జీవన విధానాన్ని ఎలా కాపాడుకుంటూ వస్తున్నదో 'ద రివర్ బిట్వీన్' నవలలో చూడగలం. ఇది కెన్యా దేశ కథ మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న జాతులు, వారి బాషా సంస్కృతుల వలపోత. ఈ ప్రపంచంలో నల్లవాడిని తెల్లవాడు, స్త్రీని పురుషుడు, కూలీని రైతు క్రమానుగతంగా దోపిడీ చేస్తున్నారుబీ వీరందరిలోనూ నల్ల జాతి స్త్రీ, వ్యవసాయ కూలీ అత్యంత వ్యవస్థీకృత హింసకు బలవుతున్నారు అంటాడు 'విజార్డ్ ఆఫ్ క్రౌ' నవలలో. ఇరవై తొమ్మిదేళ్ళ కిందట హైదరాబాద్‌లో అఖిల భారత విప్లవ సాంస్కృతిక సంస్థ జాతుల సమస్య మీద నిర్వహించిన సదస్సులో పాల్గొనటానికి గూగీ ఈ దేశం వచ్చాడు. హుస్నాబాద్‌లో అమరుల స్మృతిలో నిర్మించుకున్న ఆసియాలోనే అతిపెద్దదైన స్థూపాన్ని పారవశ్యంతో చూసాడు. "మీకు కనీసం అమరుల జ్ఞాపకాలను నిలబెట్టుకునే స్వేచ్ఛ అయినా ఉంది," అని సంతోష పడ్డాడు. ఆనాటికే తాను కెన్యా విడిచి అమెరికాలో ప్రవాసిగా బ్రతుకుతున్న వైనాన్నీ, పుట్టిన నేల మీద 'మౌ మౌ' సాయుధ పోరాట కాలంలో ప్రాణాలను కోల్పోయిన సహచరులనూ యాది చేసుకున్నాడు. మళ్ళీ ఏడేళ్ళ క్రితం 2018లో హైదరాబాద్ వచ్చాడు. అప్పుడు తన బాల్య యాది చద్దిమూటను వెంట పెట్టుకుని వచ్చాడు. గూగీ కథ వింటుంటే బస్తర్ అడవుల్లోని ఆదివాసీ గూడేల్లో, తెలంగాణ మారుమూల పల్లెల్లో నీకూ నాకూ ఎదురైన ఆకలి, అవమానం, పీడన అంతా అద్దం ముందు నిలబడినట్టు ఉంటుంది. భాషా సామ్రాజ్య వాద పెత్తనం, యూరో సెంట్రిక్ ఆలోచనల శవ పేటికకు కొట్టిన మేకులు గూగీ రచనలు. స్వాభిమాన, ప్రతిఘటన పోరాటాలు ఉన్న ప్రతిచోటా ఆయన రచనలు అనువాదం అయ్యాయి. లక్షలాది అభిమానులకు, వేలాదిమంది పరిశోధకులకు కరదీపికగా మారాయి. ఆయన పరంపరకు వేలాదిమంది వారసుల పుట్టుకొచ్చారు. ఆయన స్ఫూర్తితో ఛిద్రమైన తమ మూలాలను, కోల్పోయిన పూర్వీకుల జాడలను అక్షరీకరిస్తున్నారు. అంతేకాదు, ఆయన నలుగురు పిల్లలు కూడా రచనలను ప్రచురించారు. ఆయన కొడుకు ముకోమా వా థియాంగో పేరు మోసిన అకడమిక్. ఆఫ్రికన్ నవలా వికాసం, అస్తిత్వ రాజకీయాల మీద సాధికారత కలిగిన బుద్ధిజీవి. "నిన్ను నీవు సజీవంగా ఉంచుకోవటానికి ప్రతిఘటన ఉత్తమమైన మార్గం. అన్యాయాన్ని తిరస్కరించటమనే చిన్నపాటి రూపంలోనైనా సరే ప్రతిఘటించాలి. నీ మార్గం సరైనదని నువ్వు నమ్మితే, నీ నమ్మకాలపై నువ్వు స్థిరంగా నిలబడితే, అవే నీ ఉనికిని కాపాడతాయి," అని గూగీ బలంగా నమ్మాడు. ప్రపంచవ్యాప్తంగా పోరాడే జనుల పక్షాన తన రచనలను ఒక మద్దతు వాక్యంగా నిలబెట్టాడు. బాధిత స్వరంలో ఆయన రాజేసిన కొలిమి కెన్యన్ వాడల నుంచి బస్తర్ అడవుల దాకా సజీవం గానే ఉంది.

# సత్యాసత్యాలుజి



పాకిస్తాన్‌పై భారత్ చేసిన దాడిలో భారత వైమానికదళానికి కూడా నష్టం జరిగిందని చౌహాన్ ఒప్పుకున్నారు. విమానాలు కోల్పోయిన విషయంపై స్పష్టత ఇవ్వకపోయినా, వ్యూహాలను మెరుగుపరచామంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌పై ఇటీవల జరిపిన దాడిలో భారత వైమానికదళానికి కూడా నష్టం వాటిల్లిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ అంగీకరించారు. భారత్‌కు చెందిన ఆరువిమానాలను కూల్చేశానని పాకిస్థాన్ చెప్పడం శుద్ధ అబద్ధమని అంటూనే, ఎన్ని విమానాలను భారత్ కోల్పోయిందో ఇదమిత్థంగా చెప్పకుండా త్రిదళాధిపతి ఈ యుద్ధానికి సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. విమానాలు కోల్పోవడం కంటే, ఎందుకు, ఎలా జరిగిందన్న కారణాలు తెలుసుకోవడం ముఖ్యం కనుక, వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకొని, వ్యూహాలను మెరుగుపరుచుకొని అమలు చేశామని అన్నారాయన. ఆదిలో వేసిన ఈ తప్పటడుగులవల్ల ఒనగూరిన నష్టమెంతో చెప్పలేదు కానీ, సరిదిద్దుకున్న అనంతరం పాకిస్థాన్‌ను అద్భుతంగా దెబ్బతీయగలిగామన్నారు. ఎంతో కచ్చితత్వంతో పాక్ స్థావరాలపై దాడులు చేయడంతో వాటిని ఆపాల్సిందిగా ఆ దేశం ప్రాధేయపడిందని ఆయన వివరించారు. చైనా చేయూతతో భారత్‌ను పాకిస్థాన్ గట్టిదెబ్బ కొట్టిందన్న ప్రచారం ఉధృతంగా జరిగిన నేపథ్యంలో, అసలు చైనా సమకూర్చిన రక్షణవ్యవస్థలు సరిగా పనిచేయనేలేదని కూడా ఆయన గాలి తీసేశారు. విపక్షాలకు చౌహాన్‌వ్యాఖ్యలు మంచి మందుగుండు సమకూర్చాయి. మోదీ సర్కారు దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నదనీ, గుట్టు విప్పడం లేదు, నిజం చెప్పడం లేదు అంటూ ఆదినుంచీ ఆగ్రహిస్తున్న విపక్షాలు ఇప్పుడు మళ్ళీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను డిమాండ్ చేస్తున్నాయి. ఎన్ని విమానాలు?, ఏమిటవి అన్న ప్రశ్నలతో పాటు చాలా అనుమానాలు నివృత్తిచేసుకోవాలని, అమెరికా అధ్యక్షుడు ఒకటికి పదిసార్లు వాణిజ్యం బూచి చూపి తానే యుద్ధం ఆపానంటూ బల్లగుద్దుతున్న సంగతీ మాట్లాడుకోవాలని అవి అంటున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో ఉన్నదేమిటో జనానికి తెలియనక్కరలేదా? అన్నది మంచిప్రశ్న. ఇప్పటివరకూ పొరుగుదేశం చెబుతున్న గొప్పలను, లెక్కలను సహజంగానే నమ్మకపోవడంతో పాటు, అంతర్జాతీయ మీడియానూ, రక్షణరంగ విశ్లేషణలను సైతం భారతీయులు అనుమానించారు. పాక్‌మీద ప్రేమతో పాశ్చాత్యదేశాలన్నీ అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని భావించారు. కానీ, యుద్ధం ముగిసిన మూడువారాల తరువాత చౌహాన్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యంతో పాటు కీలకమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. యుద్ధం అన్నాక నష్టాలు సహజం అని అప్పట్లో ఎయిర్‌మార్షల్ భారతి, ఇప్పుడు చౌహాన్ ప్రత్యేకంగా ఉద్ఘాటించాల్సిన అవసరం ఏమీ లేదు. పోరాటంలో నెగ్గడంతో పాటు, పోగొట్టుకోవడం కూడా ఉంటుందని సామాన్యుడికి సైతం తెలుసు. అయితే, ఐదువిమానాలను కూల్చినట్టుగా పాక్ తొలిరోజునే చేసిన ప్రకటనను వమ్ముచేయడానికి కాబోలు, వాయుసేన పైలట్లందరూ సురక్షితంగా తిరిగివచ్చారని చెప్పి వైమానిక నష్టాలేమీ జరగలేదన్నట్టుగా ఎయిర్‌మార్షల్ దేశప్రజలకో అభిప్రాయాన్ని కలిగించారు. సరికొత్త ఒప్పందంతో, ఫ్రాన్స్‌నుంచి మరింత ఖరీదుకు కొనుక్కున్న రాఫెల్‌కు అప్రదిష్ట రాకూడదన్న జాగ్రత్త అందులో ఉండివుండవచ్చు. ఇప్పుడు సీడీఎస్ చౌహాన్ పాకిస్థాన్ అంటున్న స్థాయిలో కాకున్నా నష్టం అధికంగానే సంభవించిందని తేల్చేశారు. యుద్ధకాలంలో పాక్ పని అయిపోయిందంటూ ఎన్నిరకాల ప్రచారాలు జరిగాయో, అందులో బీజేపీ నాయకులు ఎంత ముందున్నారో అందరికీ తెలుసు. ఆ ఉద్వేగాల మధ్య, మరోపక్క పాకిస్థాన్ దీనికి ప్రతిగా, ప్రతీకారంగా మరింత విషప్రచారం సాగించిన నేపథ్యంలో, వాస్తవిక స్థితిని చెప్పడానికి సైన్యం కత్తిమీద సాముచేయాల్సివచ్చింది. అయితే, సత్యాన్ని దాచడంవల్లనో, అర్థసత్యాలు చెప్పడం వల్లనో అసత్యప్రచారాలను వమ్ముచేయడం సాధ్యంకాదు. దేశం కోసం ప్రాణాలకు తెగించిపోరాడే సైన్యానికి రాజకీయాలతో నిమిత్తం లేదు కనుక, ఉన్నదివున్నట్టు చెప్పడానికి ఏ దశలోనూ సందేహించనక్కరలేదు. ఈ యుద్ధంలో పాకిస్థాన్‌కు తీరని నష్టం చేశామని, ఉగ్రస్థావరాలను కుప్పకూల్చి ఒక కొత్త లక్ష్మణరేఖ గీశామన్నది వాస్తవం. జాగ్రత్తగానైనా కొన్ని నిజాలు విప్పినందుకు చౌహాన్‌ను అభినందించాల్సిందే. అయితే, మూడువారాల తరువాత కూడా అది 145కోట్లమంది దేశప్రజల సమక్షంలో గాక, కఠినమైన ప్రశ్నలు, విశ్లేషణలు ఎదుర్కొనే సందర్భంలో, ఒక విదేశీ వేదికమీద జరగడం కాస్తంత అసంతృప్తిని కలిగిస్తున్న మాట నిజం.

# భారత్‌కు మరో రెండు స్క్వాడ్రన్ల ఎస్-400



రష్యా ఉపరాయబారి రోమన్ బాబుష్కిన్ ప్రకారం 2025-26 నాటికి మిగిలిన రెండు ఎస్-400 స్క్వాడ్రన్లు భారత్‌కు అందజేయబడతాయి. ఇటీవల జరిగిన భారత్-పాక్ ఘర్షణలలో ఎస్-400 వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని ఆయన తెలిపారు. డ్రోన్లపై నియంత్రణ కోసం యాంటీ-డ్రోన్ సాంకేతికతను భారతదేశంతో రష్యా భాగస్వామ్యం విస్తరించే భాగంగా చర్చలు జరుగుతున్నాయి.

**వచ్చే ఏడాది నాటికి అందజేస్తాం**

**రష్యా ఉప రాయబారి బాబుష్కిన్ వెల్లడి**

న్యూఢిల్లీ, జూన్ 2: ముందు అనుకున్న ప్రకారమే 2025-26 నాటికి మిగిలిన రెండు స్క్వాడ్రన్ల ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను భారత్‌కు అందజేస్తామని.. భారత్‌లో రష్యా ఉప రాయబారి రోమన్ బాబుష్కిన్ స్పష్టం చేశారు. ఇటీవలి భారత్-పాకిస్థాన్ ఘర్షణల సందర్భంగా ఎస్-400 సమర్థవంతంగా పని చేసినట్లు తమకు తెలిసిందన్నారు. 543 కోట్ల డాలర్ల విలువైన ఐదు ఎస్-400 స్క్వాడ్రన్ల కొనుగోలుకు భారత్ 2018లో రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే మూడు స్క్వాడ్రన్లు భారత్‌కు చేరాయి. భారత్‌తో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా.. గగనతల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన చర్చలను ముందుకు తీసుకెళ్లటానికి సిద్ధంగా ఉన్నామని బాబుష్కిన్ వెల్లడించారు. భారత్-పాక్ ఘర్షణలో డ్రోన్లను భారీఎత్తున వినియోగించటాన్ని గుర్తు చేస్తూ.. డ్రోన్ల సమస్యను తాము చాలాకాలంగా ఎదుర్కొంటున్నామన్నారు. డ్రోన్లను నిలువరించే సాంకేతికతను తాము ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తున్నామని, భారత్-రష్యా రక్షణ భాగస్వామ్యం చర్చల్లో యాంటీ డ్రోన్ వ్యవస్థలు కూడా కీలకాంశమని గుర్తు చేశారు.

# సూర్యాపేట ఘటనలు ప్రభుత్వానికో హెచ్చరిక



సూర్యాపేటలో లింగ నిర్ధారణ పరీక్షలతో జరిగిన అమానవీయ ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. అనుమతులేని ఆసుపత్రులు, అవినీతిలో కూరుకుపోయిన అధికారుల వల్ల ఇద్దరి ప్రాణాలు నష్టపోయాయి. ఇటీవల సూర్యాపేటలో వెలుగుచూసిన వరుస ఘటనలతో రాష్ట్రం నివ్వెరపోయింది. ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఓ స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిగాయి. మూడోసారీ ఆడపిల్లే పుట్టబోతోందని తెలిసి, నెలల గర్భవతిగా ఉన్న ఓ మహిళ అబార్షన్‌కు సిద్ధపడింది. కాసులకు కక్కుర్తిపడిన ఓ ఆర్ఎంపీ ఆమెను పట్టణంలో అనుమతుల్లేని ఓ ఆస్పత్రిలో చేర్పించాడు. సదరు ఆస్పత్రి నిర్వాకం వల్ల ఆ గర్భవతి మృతి చెందింది. ఇక్కడి వరకూ ఓ కథ. అంతకు కొద్దిరోజుల ముందు అదే సూర్యాపేటలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఓ స్కానింగ్ సెంటర్ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత ఆ కేసు నుంచి తప్పించేందుకు నిందితుడిని స్థానిక డీఎస్పీ, సీఐ రూ.25 లక్షలు డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు! నిబంధనలను పాతరేసిన స్కానింగ్ సెంటర్, అనుమతులు లేని ఆసుపత్రి, సమాజాన్ని రక్షించాల్సిన పోలీసు అధికారులు అవినీతికి పాల్పడడం, ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులు ప్రజల ప్రాణాలను హరించడం లాంటి అమానుష ఘటనలు సభ్య సమాజంలో అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న స్కానింగ్ సెంటర్లకు, ఆసుపత్రులకు అనుమతులు ఉన్నాయా? ఉంటే అవి నిబంధనలకు లోబడే పని చేస్తున్నాయా? ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులకు సరైన అర్హతలు ఉన్నాయా? అనుమతులు లేని ఆసుపత్రులపై చర్యలు తీసుకోడానికి వైద్య ఆరోగ్యశాఖ ఎందుకు వెనుకాడుతోంది? అనుమతి లేని స్కానింగ్ సెంటర్ వ్యవహారంలో ఏసీబీకి పట్టుబడిన డీఎస్పీ, సీఐ వ్యవహారం బయటకు వచ్చిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ స్పందించి ఉండాల్సింది. అనుమతులు లేని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ అమానవీయ ఘటన జరిగేది కాదు. కేవలం వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగానే రెండు ప్రాణాలు బలయ్యాయి. తల్లిని కోల్పోయిన ఇద్దరు అమ్మాయిల భవిష్యత్తుకు భరోసా ఎవరు? రాష్ట్రంలోని పలు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న కొన్ని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులు గర్భస్థ లింగ నిర్ధారణ, పిండ విచ్ఛిన్న కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇవి గ్రామస్థాయి వరకు దళారులను నియమించుకొని లింగ నిర్ధారణ పరీక్షలతో వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ తల్లీ బిడ్డల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. మామూళ్లకు అలవాటుపడిన వైద్యాధికారులు సదరు ఆసుపత్రుల జోలికి వెళ్ళడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట ఘటనలను ఓ హెచ్చరికగా తీసుకుని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ నిరంతరం నిఘా పెట్టాలి. భ్రూణ హత్యల నిరోధక చట్టాన్ని అతిక్రమించిన వైద్యులను కఠినంగా శిక్షించాలి.

# క్యాచ్‌లు చేజారకుండా!




## డ్యూక్ బాల్స్‌పై సాధన కీలకం

## టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీ

## కఠోర కసరత్తు అవశ్యం

## 'క్యాచ్‌లు మ్యాచులను గెలిపిస్తాయి'.

టెస్టు క్రికెట్‌లోనే కాదు వైట్‌బాల్ ఫార్మాట్‌లోనూ అదే మౌళిక సూత్రం. బౌలర్లు క్రమశిక్షణతో నిలకడగా ఒత్తిడి పెంచితే.. లభించే క్యాచ్‌లను ఫీల్డర్లు జారవిడిస్తే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వికెట్ల వేట ఆశించిన స్థాయిలో లేకపోవటం మైదానంలో ఫీల్డర్లను నైరాశ్యంలోకి నెడుతుంది. క్యాచ్‌లు చేజారటం అంతిమంగా మ్యాచ్ మలుపు తిరిగేందుకు దోహదం చేస్తాయి. లీడ్స్ టెస్టులో టీమ్ ఇండియా ఈ చేదు అనుభవం చవిచూసింది. జులై 2 నుంచి ఆరంభం కానున్న రెండో టెస్టులోనైనా క్యాచ్‌లను ఒడిసిపట్టుకునేందుకు బర్మింగ్‌హామ్‌లో గిల్‌సేన కఠోర సాధన చేయక తప్పదు.

### శ్రీనివాస్ దాస్ మంతటి

### ఫీల్డింగ్ దారుణం

ఇంగ్లాండ్ తొలి టెస్టులో భారత్‌తో పాటు ఇంగ్లాండ్ ఫీల్డింగ్ సైతం పేలవం. ఇరు జట్ల నుంచి ఫీల్డర్లు కీలక క్యాచ్‌లు నేలపాలు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో కెఎల్ రాహుల్ 59 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను హ్యారీ బ్రూక్ వదిలేయగా.. రాహుల్ సెంచరీతో కదం తొక్కాడు. ఇంగ్లాండ్ బ్యాటర్లకు భారత ఫీల్డర్లు పలుమార్లు జీవనదానం చేశారు. ఏకంగా స్లిప్స్‌లోనే ఐదు క్యాచ్‌లు జారవిడిచారు. ఒలీ పోప్, హ్యారీ బ్రూక్, బెన్ డకెట్ క్యాచ్‌లను యశస్వి జైస్వాల్ వదిలేశాడు. వీరిలో పోప్, డకెట్ సెంచరీలు సాధించగా.. బ్రూక్ శతకానికి పరుగు దూరంలో నిలిచాడు. జైస్వాల్‌తో పాటు రిషబ్ పంత్, సాయి సుదర్శన్‌లు విలువైన క్యాచ్‌లు వదిలేశారు. కీలక సమయంలో క్యాచ్‌లు నేల పాలు కాగా.. ఇంగ్లాండ్ బ్యాటర్లపై ఒత్తిడి తొలగింది. చేజారిన క్యాచ్‌లతో భారత్ సుమారుగా 200 పరుగులు కోల్పోవాల్సి వచ్చింది. తొలి టెస్టు ఫలితంపై ఇది చూపించిన ప్రభావం గణనీయం.

### ఎందుకీ ఫీల్డింగ్ వైఫల్యం?

ఇటీవల టెస్టుల్లో భారత స్లిప్ కారిడార్‌లో చురుకైన ఫీల్డర్ యశస్వి జైస్వాల్. స్వల్ప కెరీర్‌లోనే జైస్వాల్ స్లిప్స్‌లో చక్కటి క్యాచ్‌లు అందుకుని జట్టు విజయాల్లో కీలక భూమిక పోషించాడు. మంచి ఫిట్‌నెస్, మైదానంలో పాదరసంలా కదిలే జైస్వాల్ సైతం క్యాచ్‌లు అందుకోవటంలో దారుణంగా తేలిపోవటం ఆశ్చర్యకరం. అయితే, అందుకు పలు కారణాలు ఉన్నాయని మాజీ క్రికెటర్లు, నిపుణుల అభిప్రాయం. చేతి వేళ్లకు తగిలిన గాయాలకు వేసుకునే పట్టీ, లీడ్స్ మైదానం స్లోప్‌తో కూడిన ఉపరితలం, స్టాండ్స్‌లో నల్లని గీతలు, గ్రౌండ్‌లో వెలుతురు లేమి సమస్య వంటివి క్యాచ్‌లు చేజారేందుకు కారణమని తెలుస్తోంది. లీడ్స్ టెస్టు స్లిప్ కార్డన్ ఉపరితలం సమంగా లేదని, స్లోప్‌తో ఉందని క్యాచ్‌లు అందుకోవటంలో ఇబ్బందికి గురి చేసిందని బుమ్రా సైతం వ్యాఖ్యానించాడు.

### డ్యూక్ బాల్స్‌తో కష్టం

క్యాచ్‌లు చేజారటంలో ఇంగ్లాండ్‌లో టెస్టులకు వాడే బంతులు సైతం ఓ కారణం. భారత్‌లో వినియోగించే ఎస్‌జీ బంతులు మృదువుగా ఉంటాయి. చేతిలో చక్కగా అమరుతాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ సహా పాకిస్తాన్‌లో టెస్టుల్లో కూకాబురా బంతిని వాడుతారు. ఇది కాస్త చిన్నగా అనిపించటంతో పాటు చక్కగా చేతుల్లోకి వచ్చేస్తుంది. కానీ ఇంగ్లాండ్‌లో వాడే డ్యూక్ బాల్స్ అందుకు విరుద్ధం. కఠినంగా, కాస్త పెద్దగా అనిపిస్తాయి. డ్యూక్ బాల్స్‌ను ఫీల్డింగ్‌లో అందుకోవటం అంత సులువు కాదు. ప్రాక్టీస్ సెషన్లో సైతం కాస్త ఇటు అయితే చేతి వేళ్లకు గాయాలు అవుతాయి. యశస్వి జైస్వాల్ అందుకే చేతికి పట్టీ వేసుకుని ఫీల్డింగ్ చేశాడు. ఇలా పట్టీతో ఉన్నప్పుడు క్యాచ్ అందుకోవటం మరింత కష్టతరం. చేతి వేళ్లను స్వేచ్ఛగా కదించలేని పరిస్థితికి తోడు బంతి పట్టీకి తగిలి చేతిలో నుంచి పడిపోతుంది. అందుకే, యశస్వి జైస్వాల్ నాలుగు క్యాచ్‌లు వదిలేసినా.. చెత్త ఫీల్డర్ అంటూ నిందలు వేయవద్దని భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ సహా మాజీ క్రికెటర్లు మహ్మద్ కైఫ్, రవిచంద్రన్ అశ్విన్‌లు ఈ అంశంలో సాంకేతిక సమస్యలను పంచుకున్నారు.

### పరిస్థితులూ ఓ సవాలే

ఇంగ్లాండ్‌లో శీతల వాతావరణ పరిస్థితులు సహజం. టెస్టు మ్యాచ్ ఉదయం 11 గంటలకు మొదలైనా.. చలిలో ఫీల్డింగ్ ఎంతో సవాల్‌తో కూడుకున్నది. స్వల్ప ఉష్ణోగ్రతలతో ఆటగాళ్లు తిమ్మిర్లకు గురవుతారు. దీంతో స్లిప్స్‌లో రెప్పపాటులో అందుకోవాల్సిన క్యాచ్‌లు వాతావరణ పరిస్థితుల కారణంతో నేల పాలు అవుతున్నాయి. ఇంగ్లాండ్ క్రికెటర్లు సైతం ఈ పరిస్థితుల్లో తడబాటుకు గురవుతున్నారంటే భారత ఫీల్డర్ల కష్టాలను అర్థం చేసుకోవచ్చు. దీనికి పరిష్కారం.. భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ సెషన్లో ఫీల్డింగ్ డ్రిల్స్‌లో కఠోరంగా శ్రమించాలి. డ్యూక్ బాల్స్‌ను అందుకునేందుకు పరిస్థితులకు తగినట్టు మార్పులు చేసుకోవాలి. వీలైనంత వేగంగా డ్యూక్ బాల్స్‌కు అలవాటు పడాలి.

### సాధనతోనే సమస్యకు చెక్

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడుతున్న ఆటగాళ్లలో పంత్, జడేజా, రాహుల్, బుమ్రా, శార్దుల్, గిల్ మినహా ఇతర క్రికెటర్లకు ఇక్కడి పిచ్‌లు, పరిస్థితులపై ఆడిన అనుభవం లేదు. ఇది టీమ్ ఇండియా ఎదుర్కొంటున్న మరో సమస్య. జాతీయ జట్టు తరఫున ఆడుతున్న క్రికెటర్లు కొత్త పరిస్థితులకు అలవాటు పడాలి. రెండో టెస్టు మ్యాచ్‌కు మరో మూడు రోజుల సమయం ఉంది. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు గిల్‌సేన ఫీల్డింగ్, క్యాచ్‌లపై ఫోకస్ పెట్టాలి. మ్యాచ్ సిములేషన్స్‌లో క్యాచ్‌లను సైతం భాగం చేయాలి. స్పిన్, పేస్‌పై స్లిప్స్‌లో క్యాచ్‌లను సుదీర్ఘ సెషన్ల పాటు ప్రాక్టీస్ చేయాలి. 30 యార్డ్ సర్కిల్ ఆవల క్యాచ్‌ల సాధనకు రిలే క్యాచ్‌లను ప్రాక్టీస్ చేయాలి. గాయాలు తగిలినప్పుడు చేతికి పట్టీ వేసుకున్నా.. ఒడుపుగా క్యాచ్‌లు అందుకునేలా ఫీల్డింగ్ డ్రిల్స్ రూపకల్పన ఉండాలి. అప్పుడే బర్మింగ్‌హామ్‌లో టీమ్ ఇండియా క్యాచ్‌లు జారవిడిచే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి.

### ఎడ్జ్‌బాస్టన్‌లో జాగ్రత్త

తొలి టెస్టు వేదిక లీడ్స్‌తో పోల్చితే రెండో టెస్టు వేదిక ఎడ్జ్‌బాస్టన్ తొలి రెండు రోజుల్లో పేస్‌కు అందించే అనుకూలత అధికం. ఫలితంగా, తొలి రెండు రోజులు స్లిప్స్‌లో క్యాచ్ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎడ్జ్‌బాస్టన్ పిచ్‌పై పచ్చిక సైతం ఎక్కువగా ఉంచుతున్నారు. బ్యాటింగ్‌కు అనుకూలమైనా పిచ్ అయినా.. ఆరంభంలో బౌలర్లకు సహకరిస్తుంది. మిస్‌ఫైర్ షాట్లు సహా ఎడ్జ్‌లతో స్లిప్స్‌లో క్యాచౌట్ అవకాశాలు ఎక్కువ. ఇక్కడి గ్రౌండ్ ఉపరితలం సమతలంగా ఉండటంతో స్లిప్ కార్డన్‌లో ఫీల్డర్లకు పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చు. ఈ పరిస్థితులను శుభ్‌మన్ గిల్ సేన సద్వినియోగం చేసుకుంటే ఫలితంలో వ్యత్యాసం రాబట్టవచ్చు.

# బుమ్రా సిద్ధమేనా

## రెండోరోజు నెట్స్‌లో చెమటోడ్చిన పేసర్



బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో రెండో టెస్టుకు భారత్ సన్నాహకాల్లో శనివారం కీలక పరిణామం చోటు చేసుకుంది. పేస్ దళపతి బుమ్రా రెండో రోజు తీవ్రంగా సాధన చేయడమే ఆ పరిణామం. పని భారం నిర్వహణలో భాగంగా..వచ్చే నెల 2 నుంచి ఇక్కడ జరిగే రెండో టెస్టుకు బుమ్రాకు విశ్రాంతి ఇస్తారని విస్తృతంగా వార్తలు వస్తున్నాయి. వీటికి బలం చేకూరుస్తూ శుక్రవారం, తొలిరోజు మిగిలిన జట్టంతా ప్రాక్టీస్ చేసినా బుమ్రా పాల్గొనలేదు. బుమ్రాతోపాటు మరో పేసర్ ప్రసిద్ధ్ కూడా మొదటి రోజు సాధనకు దూరంగా ఉన్నాడు. దాంతో పనిభారం నిర్వహణలో భాగంగా బుమ్రా వైదొలగుతాడని, తొలి టెస్టులో అంతగా ఆకట్టుకోలేకపోయిన ప్రసిద్ధ్‌పై రెండో టెస్టుకు వేటు పడుతుందనే చర్చ మొదలైంది. అయితే ఈ సిరీసలో 0-1తో భారత్ వెనుకంజలో ఉన్న నేపథ్యంలో రెండో టెస్టులో బుమ్రా ఆడాల్సిన అవసరం ఎంతో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక..శనివారంనాటి ప్రాక్టీసలో పేస్ త్రయం బుమ్రా, సిరాజ్‌తోపాటు ప్రసిద్ధ్ శ్రమించారు. మొత్తంగా బుమ్రా ప్రాక్టీస్ చేయడంతో జట్టులో ఉత్సాహం నిండింది. కానీ రెండో టెస్టుకు తుది జట్టులో బుమ్రా ఉంటాడా అనే విషయమై స్పష్టత రాలేదు. ఇక..బ్యాటర్ సాయి సుదర్శన్ రెండో రోజు సాధనలో తొలుత బ్యాటింగ్‌కు దిగాడు.

# శతక్కొట్టిన మంధాన



దీప్తి శర్మ

**తెలుగమ్మాయి శ్రీచరణి విజృంభణ**

**అరంగేట్ర మ్యాచ్‌లోనే 4 వికెట్లు**

**తొలి టీ20లో ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం**

**51 బంతుల్లోనే సెంచరీ**

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టు ఘనంగా బోణీ చేసింది. తాత్కాలిక కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతీ మంధాన (62 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 112) తన టీ20 కెరీర్‌లో తొలి సెంచరీతో అదరగొట్టింది. ప్రత్యర్థి బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం చూపిన స్మృతి ఆఖరి ఓవర్‌లో వెనుదిరగగా, హర్లీన్ డియోల్ (23 బంతుల్లో 7 ఫోర్లతో 43) అద్భుత సహకారం అందించింది. ఇక, తెలుగమ్మాయి, కడప జిల్లాకు చెందిన శ్రీచరణి తన అరంగేట్ర మ్యాచ్‌లోనే సత్తా చాటుతూ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టింది. ఫలితంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 97 రన్స్‌తో ఘన విజయం సాధించింది. టీ20ల్లో ఇంగ్లండ్‌కిదే అతిపెద్ద ఓటమి. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 1-0తో పైచేయి సాధించింది. రెండో మ్యాచ్ మంగళవారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. లారెన్ బెల్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. తొలి అంతర్జాతీయ టీ20 ఆడిన యువ స్పిన్నర్ శ్రీచరణి (3.5-0-12-4) అద్భుత గణాంకాలు నమోదు చేయడంతో ఇంగ్లండ్ 14.5 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ జట్టులో కెప్టెన్ సివర్ బ్రంట్ (42 బంతుల్లో 10 ఫోర్లతో 66) మినహా ఎవరూ రాణించలేదు. రాధా యాదవ్, దీప్తి శర్మలకు రెండేసి వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా మంధాన నిలిచింది. వామప్ మ్యాచ్‌లో తలకు గాయం కావడంతో ముందు జాగ్రత్తగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు విశ్రాంతినిచ్చారు.

మంధాన, హర్లీన్ జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ మంధాన, వన్‌డౌన్ బ్యాటర్ హర్లీన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో భారీ స్కోరును అందించారు. అయితే చివర్లో పుంజుకున్న ఇంగ్లండ్ బౌలర్లు కాస్త కట్టడి చేయగలిగారు. ఆరంభంలో మరో ఓపెనర్ షఫాలీ (20) తడబడినా.. మంధాన సహజశైలిలో బ్యాట్ ఝుళిపించింది. మైదానం నలువైపులా భారీ షాట్లు ఆడేస్తూ చకచకా స్కోరును పెంచింది. తొలి వికెట్‌కు షఫాలీతో కలిసి 77 పరుగులు అందించింది. ఆ తర్వాత హర్లీన్ రాకతో భారత్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. పదో ఓవర్‌లో ఆమె మూడు ఫోర్లు సాధించింది. అలాగే మంధాన సిక్సర్‌తో స్కోరు 11వ ఓవర్‌లోనే వందకి చేరింది. అయితే హర్లీన్ 26 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను వ్యాట్ హాడ్జ్ వదిలేసింది. అటు అవలీలగా బౌండరీలు బాదేసిన మంధాన 51 బంతుల్లోనే టీ20 కెరీర్‌లో తొలి సెంచరీ పూర్తి చేసుకుంది. 16వ ఓవర్‌లో హర్లీన్‌ను పేసర్ లారెన్ బెల్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 94 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అనంతరం భారత్ వేగంగా వికెట్లను కోల్పోయింది. రిచా (12), జెమీమా (0) 18వ ఓవర్‌లో వెనుదిరిగారు. ఆఖరి ఓవర్‌లో ఫోర్‌తో స్కోరును 200కి చేర్చిన స్మృతి మంధాన ఆ వెంటనే అవుటైంది. మొత్తంగా చివరి మూడు ఓవర్లలో జట్టు 26 పరుగులే సాధించింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 210/5 (స్మృతీ మంధాన 112, హర్లీన్ డియోల్ 43, షఫాలీ 20బీ బెల్ 3/27). ఇంగ్లండ్: 14.5 ఓవర్లలో 113 ఆలౌట్. (సివర్ 66బీ శ్రీచరణి 4/12, రాధా యాదవ్ 2/15, 2/32). భారత్ తరఫున మహిళల టీ20ల్లో అత్యధిక స్కోరు (112) సాధించిన స్మృతీ మంధాన. హర్మన్‌ప్రీత్ (103)ను అధిగమించింది. అలాగే మూడు ఫార్మాట్లలోనూ శతకం బాదిన తొలి భారత ప్లేయర్‌గా స్మృతి నిలిచింది. అంతర్జాతీయ మహిళల టీ20ల్లో ఏ వికెట్‌కైనా ఎక్కువ (21) 50ం భాగస్వామ్యాలు నమోదు చేసిన జోడీగా మంధాన-షఫాలీ. గతంలో అలీసా హీలీ-బెథ్ మూనీ (20) పేరిట ఈ రికార్డు ఉండేది. టీ20ల్లో భారత మహిళల జట్టుకిది రెండో అత్యధిక స్కోరు (210). గతేడాది వెస్టిండీసపై 217 పరుగులు సాధించింది.

# మందన మెరుపులుటీ20ల్లో తొలి సెంచరీతో విజృంభణ

## టీ20ల్లో తొలి సెంచరీతో విజృంభణ

## ఇంగ్లండ్‌పై భారత్ భారీ విజయం

## తెలుగు స్పిన్నర్ శ్రీచరణికి నాలుగు వికెట్లు



స్మృతి మందన దుమ్మురేపింది! ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20లో మందన మెరుపులు మెరిపించింది. పసలేని ఇంగ్లండ్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ అంతర్జాతీయ టీ20ల్లో తొలి సెంచరీతో కదంతొక్కింది. కళాత్మక షాట్లకు తోడు హార్డ్‌హిట్టింగ్ బ్యాటింగ్‌తో పరుగుల వరద పారించింది. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా దంచుతూ పలు రికార్డులు కొల్లగొట్టింది. మందన శతక విజృంభణతో భారీ స్కోరు అందుకున్న భారత్..బౌలింగ్‌లోనూ అదరగొట్టింది. తెలుగు స్పిన్నర్ శ్రీచరణి నాలుగు వికెట్లతో ఇంగ్లండ్ పతనంలో కీలకమైంది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటిన టీమ్‌ఇండియా సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్లు మందన, షెఫాలీ..టీమ్‌ఇండియాకు మెరుగైన శుభారంభం అందజేశారు. తాను ఎదుర్కొన్న తొలి బంతినే ఫోర్‌గా మలిచిన మందన మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. ఓవైపు షెఫాలీ క్రీజులో కుదురుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నా..మందన మాత్రం ఎక్కడ తడబడలేదు. స్మిత్ వేసిన నాలుగో ఓవర్‌లో మందన మూడు ఫోర్లతో జోరు కనబరిచింది. ఈ క్రమంలో పవర్‌ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా వికెట్ కోల్పోకుండా 47 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన ఎకల్‌స్టోన్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మందన రెండు భారీ సిక్స్‌లకు తోడు షెఫాలీ ఫోర్ కొట్టడంతో 19 పరుగులు వచ్చాయి. కాప్సె 8వ ఓవర్‌లో బౌండరీతో టీ20ల్లో మందన 31వ అర్ధసెంచరీ మార్క్ అందుకుంది. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌లో అర్లాట్ బౌలింగ్‌లో షెఫాలీ ఔట్ కావడంతో 77 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. హర్లిన్ డియోల్ వచ్చి రావడంతోనే బౌండరీలతో జోరు కనబరిచింది. హర్లిన్ మద్దతుతో మందన ఎదురైన బౌలర్‌నల్లా బాదుతూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేసింది. ఈ జోడీని విడదీసేందుకు ఇంగ్లండ్ కెప్టెన్ ప్రయత్నించినా లాభం లేకపోయింది. బెల్ 16వ ఓవర్‌లో ఫోర్‌తో మందన టీ20ల్లో తొలి సెంచరీ మార్క్ అందుకుని అభిమానులకు అభివాదం చేసింది. ఇదే ఓవర్‌లో హర్లిన్ ఔట్ అయ్యింది. ఆ తర్వాత బెల్ బౌలింగ్‌లో బంతి తేడాతో రీచాఘోష్(12), జెమీమా(0) వెంటవెంటనే ఔటయ్యారు. లాభం లేదనుకుని బ్యాటు ఝుళిపించే క్రమంలో ఎకల్‌స్టోన్ బౌలింగ్‌లో నాట్‌స్కీవర్‌కు క్యాచ్ ఇచ్చి మందన ఐదో వికెట్‌గా వెనుదిరిగింది.మందన సూపర్ నాటింగ్‌హామ్: భారత స్టార్ క్రికెటర్ స్మృతి మందన సత్తాచాటింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ గైర్హాజరీలో టీమ్‌ఇండియా పగ్గాలు అందుకున్న మందన సూపర్ సెంచరీతో విజృంభించింది. శనివారం జరిగిన తొలి టీ20లో భారత్ 97 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై భారీ విజయం సాధించింది. తొలుత కెప్టెన్ మందన(62 బంతుల్లో 112, 15ఫోర్లు, 3సిక్స్‌లు) సెంచరీకి తోడు హర్లిన్ డియోల్(43) రాణించడంతో టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 210/5 స్కోరు చేసింది. టీ20ల్లో భారత్‌కు ఇది రెండో అత్యుత్తమ స్కోరు. చాలా రోజుల తర్వాత తిరిగి జట్టులోకి వచ్చిన షెఫాలీ వర్మ(20) నిరాశపరిచినా..మందన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. బెల్(3/27)మూడు వికెట్లు తీసింది. లక్ష్యఛేదనలో..శ్రీచరణి(4/12) ధాటికి ఇంగ్లండ్ 14.5 ఓవర్లలో 113 పరుగులకు కుప్పకూలింది. ఈ తెలుగు స్పిన్నర్ విజృంభణకు కెప్టెన్ స్కీవర్ బ్రంట్(66) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. దీప్తిశర్మ, రాధాయాదవ్ రెండేసి వికెట్లు తీశారు. సెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన మందనకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

### చరణి స్పిన్ తంత్రం:

భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లండ్‌కు ఏదీ కలిసిరాలేదు. 9 పరుగులకే ఓపెనర్లు సోఫీ డంకీ(7), డానీ వ్యాట్(0) సింగిల్ డిజిట్ స్కోర్లకు పెవిలియన్ చేరారు. ఓవైపు కెప్టెన్ స్కీవర్ బ్రంట్ ఒంటరిపోరాటం చేసినా..అరంగేట్రం మ్యాచ్‌లోనే శ్రీచరణికి తోడు దీప్తిశర్మ, రాధాయాదవ్ స్పిన్ మాయాజాలంతో ఇంగ్లండ్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. బ్యూమౌంట్(10), అమీ జోన్స్(1), కాప్సె(5), అర్లాట్(12), ఎకల్‌స్టోన్(1) విఫలమయ్యారు. ఇదే అదనుగా టీమ్‌ఇండియా స్పిన్నర్లు చెలరేగడం మనకు కలిసొచ్చింది.



Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com